

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల, ఆగస్టు 6: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మిగిలిన సీట్ల భర్తీకి మూడో విడత నోటిఫికేషన్ విడుదలైనట్టు ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా అడ్మిషన్ల కన్వీనర్ ఎల్.సుధాకరరావు తెలిపారు. 'అభ్యర్థులు ఆన్‌లైన్‌లో(ఐటీఐ డాట్ ఏపీడాట్ జీవోవీ డాట్) ఈ నెల 26వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఏ ఐటీఐలో చేరాలనుకుంటున్నారో రిజిస్ట్రేషన్ ఫారంతో పాటు ఒరిజనల్ సర్టిఫికెట్లతో సమీపంలోని ఏదైనా ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 27వ తేదీలోగా పరిశీలన చేయించాలి. దరఖాస్తు చేసుకున్న ఐటీఐలో ఈ నెల 29న ఉదయం 9గంటలకు నిర్వహించనున్న కౌన్సెలింగ్‌కు హాజరుకావాలి' అని సుధాకరరావు సూచించారు.

వారంతా.. వైసీపీ ఉద్యోగులే!



శాసనం రోడ్డులోని బాలికల గురుకుల పాఠశాల



- డిగ్రీ కళాశాల, బాలికల గురుకుల పాఠశాలలో అడ్డగోలు నియమకాలు
- ఆ నలుగురు సిఫారసులకే ప్రాధాన్యం
- కనీస నిబంధనలు పాటించని నాటి అధికారులు
- ప్రస్తుతం కొలువు కాపాడుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు

(పలాస)

జిల్లాలో ఎక్కడా లేని విధంగా పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటి లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బాలికల గురుకుల పాఠశాలలో అడ్డగోలుగా నియామకాలు చేపట్టారు. వైసీపీ పాలనలో అంతా ఆ పార్టీ కార్యకర్తలు, వారి బంధువులనే.. ఉద్యోగులుగా నియమించేశారు. ఉద్యోగాలు భర్తీ చేయాలంటే ముందుగా నోటిఫికేషన్ ఇవ్వాలి. కులాల వారీ పోస్టులు కేటాయించాలి. దరఖాస్తుదారుల అర్హత మేరకు ఇంటర్వ్యూలు చేసి.. సంబంధిత కళాశాల, గురుకుల పాఠశాల కమిటీ ఆమోదం మేరకు నియామకాలు చేపట్టాలి. కానీ, ఇవేవీ లేకుండా కేవలం అప్పట్లో 'ఆ నలుగురు' సిఫారసులకు ప్రాధాన్యమిస్తూ.. పోస్టులు భర్తీచేశా రు. వైసీపీ కార్యకర్తలు, నేతల అనుచరులు, బంధువులను నియమించడమే కాకుండా.. రోస్టర్ పాటించకుండా ఒక సామాజిక కులానికి పోస్టులన్నీ కట్టబెట్టి సొమ్ములు చేసుకున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో.. అప్పట్లో కొలువులు పొందిన వారంతా తమ ఉద్యోగాలు కాపాడు కునేందుకు టీడీపీ నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.



పలాసలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల

● డిగ్రీ కళాశాలలో అర్హులు ఒక్కరే..

పలాసలో 2019 సంవత్సరానికి ముందే టీడీపీ హయాంలో డిగ్రీ కళాశాలకు మోక్షం లభించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో కళాశాల ప్రారంభమైంది. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో తాత్కాలికంగా ఖాళీ గదుల్లో డిగ్రీ కళాశాల నిర్వహిస్తున్నారు. ఈ కళాశాలలో ముందుగా ప్రభుత్వ అధ్యాపకుల నియామకం చేపట్టారు. ప్రిన్సిపాల్‌గా రాయలసీమ ప్రాంతం నుంచి ఓ అధికారి వ్యవహరిస్తున్నారు. అప్పట్లో ఒప్పంద ప్రాతిపదికన సిబ్బందిని నియమించాలని పాలకులు భావించారు. ఈ మేరకు ఎంత అవసరమో యూనివర్సిటీ నుంచి ఒప్పించుకున్నారు. 13మంది నాన్‌టీచింగ్ స్టాఫ్ నియమించారు. అప్పట్లో వారి నుంచి భారీగా వసూళ్లకు పాల్పడ్డారు. కొంతమంది వైసీపీ వీర విధేయులకు ఉత్తినే పోస్టులు కట్టబెట్టారు. ప్రస్తుతం ఒకొక్కరికి రూ.18వేల నుంచి రూ.20వేల వరకూ వేతనాలు ఇస్తున్నారు. ఇదిలా ఉండగా అందులో అర్హత ఉన్నవారు ఒక్కరు ఉండడం గమనార్హం. వైసీపీ వీర విధేయులు, కార్యకర్తలకు ఈ పోస్టులు కట్టబెట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. నోటిఫికేషన్ కానీ, ఇంటర్వ్యూలు కానీ లేకుండా నియమకాలు చేపట్టడంపై విమర్శలు వెల్లువెత్తాయి. అప్పట్లో ఈ వ్యవహారంపై వైసీపీలోని ఓ వర్గం అభ్యంతరాలు తెలపగా.. మాజీమంత్రి వారికి సర్దిచెప్పినట్టు తెలుస్తోంది.

● గురుకులంలో కానరాని రోస్టర్..

బాలికల గురుకుల పాఠశాలలోనూ అడ్డగోలుగా నియమకాలు సాగాయి. ఇక్కడ టీచింగ్ స్టాఫ్ 8 మంది ఉండగా, నాన్‌టీచింగ్ స్టాఫ్ 13 మంది ఉన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ కులాల వారీ.. రోస్టర్ ప్రకారం నియమకాలు చేపట్టాలి. కానీ, బీసీ-ఏ ఏడుగురు, బీసీ-డీలో ఒకరిని నియమించారు. మిగిలినవి ఇతరులతో నింపేశారు. అందులో ఎస్సీ, ఎస్టీలు ఒక్కరూ లేకపోవడం.. నియామకాల్లో అవకతవకలకు అద్దం పడుతోంది. కేవలం సిఫారసుల మేరకు నియమకాలు జరగ్గా.. అందులో వైసీపీ నేతల భార్యలు, బంధువులే ఉండడం చర్చనీయాంశంగా మారింది. టీచింగ్ స్టాఫ్ కన్నా నాన్‌టీచింగ్ స్టాఫ్ హవా కొనసాగుతోంది. మొన్న సార్వత్రిక ఎన్నికల్లో ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది.. వైసీపీ గెలుపు కోసం ముమ్మర ప్రచారం చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

● ప్రస్తుతం ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడంతో.. గతంలో డిగ్రీ కళాశాల, గురుకుల పాఠశాలల్లో చేపట్టిన అడ్డగోలు నియామకాలపై చర్చ సాగుతోంది. ఇప్పటికే ఈ వ్యవహారంపై టీడీపీ ముఖ్యనేత ఆధారాలతో సహా వివరాలు సేకరించినట్టు సమాచారం. కాగా.. గత ప్రభుత్వంలో నియమితులైన ఉద్యోగులంతా తమ కొలువు కాపాడుకునేందుకు టీడీపీ నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అక్రమ నియామకాలపై రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు, ఎమ్మెల్యే గౌతు శిరీష ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి.

నీటిసరఫరా కార్యాలయంలో ఫైళ్లు చోరీ

- పాత భవనం వెనక కిటికీ పగలగొట్టి అపహరణ
- చెత్త దుకాణంలో మూటలు ప్రత్యక్షం

పలాస రూరల్, ఆగస్టు 6: పలాస మండలం కాశీబుగ్గ ఉప గ్రామీణ నీటి సరఫరా పాత కార్యాలయంలో సోమవారం రాత్రి పాత ఫైళ్లను దొంగలు ఎత్తుకెళ్లారు. పలాస మండల పరిషత్ కార్యాలయం పక్కనే ఉన్న ఈ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ప్రధాన గ్రామీణ నీటి సరఫరా కార్యాలయంలోనే అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. పాత కార్యాలయంలో గ్రామీణ నీటి సరఫరా, ఇంజనీరింగ్ పనులకు సంబంధించి పాత ఫైళ్లను ఉంచి.. మిగతావి ప్రధాన కార్యాలయంలో భద్రపరిచారు. కాగా.. పాత కార్యాలయంలో భద్రపరిచిన పూర్వకాలానికి చెందిన కాంట్రాక్టర్ల బిల్లులు, ఎం.బుక్ వివరాలు వంటి పాత ఫైళ్ల వాడకం పూర్తిగా లేదు. ఈక్రమంలో చిల్లర దొంగతనాలు చేసేవారు కార్యాలయం వెనక వైపున ఉన్న కిటికీని ఊడగొట్టి పాత ఫైళ్లను మూటలు కట్టి.. చెత్త దుకాణంలో విక్రయించారు. ఈ విషయం ఇంజనీరింగ్ అధికారులకు తెలియడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు, అధికారులు చెత్త దుకాణం వద్దకు చేరుకుని ఈ విషయమై ఆరా తీశారు. విక్రయించిన ఫైళ్ల మూటలను స్వాధీనం చేసుకుని.. ప్రధాన కార్యాలయానికి తరలించారు.

అనుమానాలెన్నో..

ఇటీవల పలుచోట్ల పాత ఫైళ్ల దొంగతనాలు, కాల్చివేయడం జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉప గ్రామీణ నీటిసరఫరా పాత కార్యాలయంలో పాత ఫైళ్లను దొంగిలించడం.. ఆకతాయిల పనా? లేదా ఇంకెవరైనా చేసి ఉంటారా? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. దొంగలు కుర్చీలు, బెంచీలు, ఇతర వస్తువులు ఏవీ కాకుండా కేవలం ఫైళ్లను మాత్రమే తీసుకెళ్లడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తే అసలు విషయం బయటపడుతుందనే వాదన వినిపిస్తోంది.

● ఈ విషయంపై ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ ప్రసన్నకుమార్ వద్ద ప్రస్తావించగా.. 'ఆ కార్యాలయం పాత భవనం కావడంతో పాతకాలం కవరింగ్ లెటర్లు, పాత ఫైళ్లను మాత్రమే ఉంచుతున్నాం. అప్పుడప్పుడూ ఆ కార్యాలయానికి వెళ్లి వస్తున్నాం. పాతఫైళ్ల మూటలను చెత్త దుకాణంలో విక్రయించినట్టు సమాచారం రావడంతో పోలీసులతో కలిసి అక్కడకు వెళ్లి స్వాధీనం చేసుకున్నాం. మిగతా ఫైళ్లను కార్యాలయం నుంచి ప్రధాన కార్యాలయానికి తరలించామ'ని తెలిపారు.



పాత కార్యాలయంలో ఊడగొట్టిన కిటికీ



చెత్త దుకాణం వద్ద ఫైళ్ల మూటలు

ఉపాధి కోసం వెళ్లి.. విగతజీవిగా మారి..

- చెన్నైలో బోటు ప్రమాదం
- జిల్లా మత్స్యకారుడు మృతి



ధర్మారావు (ఫైల్)

సోంపేట, ఆగస్టు 6: ఉపాధి కోసం వలస వెళ్లిన జిల్లా మత్స్యకారుడు.. విగతజీవిగా మారాడు. సముద్రంలో చేపలవేట సాగిస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి ప్రాణాలు కోల్పోయాడు. కుటుంబ సభ్యులకు తీరని విషాదాన్ని మిగిల్చాడు. వివరాల్లోకి వెళితే.. సోంపేట మండలం రామయ్యపట్నం గ్రామానికి చెందిన వాడ ధర్మారావు(32).. చెన్నైలోని బోటు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికంగా ఉపాధి లేక ఏటా చాలా మంది మత్స్యకారులు జిల్లా నుంచి చెన్నై, గుజరాత్ తదితర ప్రాంతాలకు వలస పోతుంటారు. ఏటా ఆగస్టులో వెళ్లి.. వేట నిషేధ సమయమైన ఏప్రిల్‌లో స్వగ్రామాలకు చేరుకుంటారు. ఈ క్రమంలో వాడ ధర్మారావు కూడా ఉపాధి కోసం 15 రోజుల కిందటే చెన్నై వెళ్లాడు. ఎప్పటిలాగే మంగళవారం తోటి మత్స్యకారులతో కలిసి సముద్రంలో చేపలవేటకు వెళ్లాడు. కాగా.. వేట సాగిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడి గాయాలపాలై మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. ధర్మారావుకు భార్య జానకి, ఒక కుమారుడు, ఇంటర్, పదోతరగతి చదువుతున్న ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ధర్మారావు రెండు రోజుల కిందటే పిల్లల చదువు నిమిత్తం ఇంటికి రూ.30వేలు పంపించారు. ఇంతలోనే ఆయన మరణవార్త తెలుసుకుని భార్య, పిల్లలు లబోదిబోమంటున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. జిల్లా మత్స్యకారులు.. ఇతర రాష్ట్రాల్లో ప్రమాదవశాత్తు మృతి చెందితే ఎటువంటి బీమా అందడం లేదని.. ప్రభుత్వమే బాధిత కుటుంబాలను ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాలపై ఆరా

- భవన యజమానులకు నోటీసులు
- విద్యుత్ కనెక్షన్ల మంజూరుపై చర్చ

నరసన్నపేట, ఆగస్టు 6: నరసన్నపేట మేజర్ పంచాయతీలో అక్రమ నిర్మాణాలపై సుడా, పంచాయతీ అధికారులు స్పందించారు. నరసన్నపేటలోని మఠంవీధి, కళాశాల రోడ్డు, సత్యవరం జంక్షన్, పాత బస్టాండ్, నేతాజీ వీధి, మారుతీనగర్, శ్రీరామనగర్, బండివీధి, వీరన్నాయుడు కాలనీ, ఇందిరానగర్, గాంధీనగర్, గొట్టిపల్ల రోడ్డు తదితర ప్రాంతాల్లో ఇళ్ల అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. భవన యజమానులు రెసిడెన్షియల్‌కు అనుమతులు తీసుకుని కమర్షియల్ కాంప్లెక్స్‌గా నిర్మిస్తూ పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన "పేటలో అక్రమ నిర్మాణాలు" కథనానికి జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. నరసన్నపేటలో 2019 నుంచి 2024 వరకు సుడా అనుమతితో ఎక్కడక్కడ నిర్మాణాలు చేశారు, రెసిడెన్షియల్ పేరిట అనుమతులు తీసుకుని వాణిజ్య పరంగా నిర్వహిస్తున్న భవనాలపై సుడా అధికారులు ఆరా తీస్తున్నారు. మరోవైపు పంచాయతీ అధికారులు.. పలువురు అక్రమ నిర్మాణదారులకు మంగళవారం నోటీసులు జారీ చేశారు. రెసిడెన్షియల్ పేరిట అనుమతి తీసుకొని వాణిజ్య సముదాయాలు నిర్వహించే భవనాల యాజమానులకు నోటీసులు అందజేశారు. ప్లాను అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణాలకు విద్యుత్ కనెక్షన్లు ఎలా ఇచ్చారన్న విషయమై ఆరా తీస్తున్నారు. దీంతో అక్రమార్కుల్లో అలజడి రేగుతోంది.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కాలువపై వంతెన.. అధికారుల పరిశీలన

సంతబొమ్మాళి, ఆగస్టు 6: సంతబొమ్మాళి పంచాయతీ రెయ్యపేట వద్ద సాగునీటి కాలువపై అనధికారికంగా నిర్మించిన వంతెనను వంశధార అధికారులు మంగళవారం పరిశీలించారు. సాగునీటి కాలువపై అనుమతులు లేకుండా వంతెన నిర్మాణంపై 'ఆంధ్రజ్యోతి'లో 'రియల్ దందా' శీర్షికతో మంగళవారం వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం నరసన్నపేట వంశధార జేఈలు సింహాచలం, శోభనబాబు రెయ్యపేట వద్ద సర్వే 190-1లో రియల్ ఎస్టేట్ యాజమాని అక్రమంగా కాంక్రీట్‌తో నిర్మించిన వంతెనను పరిశీలించారు. దేశీయగెడ్డ నీరు 40ఆర్, 39ఆర్ వంశధార కాలువ ద్వారా నీరు పొలాలకు ఈ సాగునీటి కాలువ ద్వారా వెళుతుందని జేఈ సింహాచలం తెలిపారు. ఎంతమేర ఆక్రమణకు గురైందో సర్వే చేసి అప్పగించమని తహసీల్దార్‌కు తమ శాఖ ద్వారా లేఖ రాస్తున్నామన్నారు. ఈ అనధికార వంతెన నిర్మాణంపై శాఖ ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు. సర్వే అనంతరం సాగునీటి కాలువపై నిర్మించిన వంతెనతో పాటు ఆక్రమణలను తొలగిస్తామన్నారు.



వంతెనను పరిశీలిస్తున్న వంశధార జేఈలు

నేటి నుంచి పీజీ సెట్ వెబ్ ఆప్షన్ల నమోదు

ఎచ్చెర్ల, ఆగస్టు 6: రాష్ట్రంలోని యూనివర్సిటీలు, అనుబంధ కళాశాలల్లో సీట్ల భర్తీకి ఏపీ పీజీ సెట్-2024 వెబ్‌ఆప్షన్ల నమోదు ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభమవుతుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'ఏపీ పీజీసెట్ -2024కు హాజరై ర్యాంకు పొందిన విద్యార్థులు ఈ నెల 7 నుంచి 12లోగా వెబ్ ఆప్షన్లను ఏపీ ఎస్‌సీహెచ్‌సీ డాట్ ఏపీ జీవోవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాలలో ఎంకాం, ఎం.ఏ ఎకనామిక్స్, రూరల్ డెవలప్‌మెంటు, సోషల్ వర్క్, ఇంగ్లీష్, తెలుగు, ఎంఈడీ, ఎంఎల్ఐసీ, ఎంజేఎంసీ కోర్సులు ఉన్నాయి. వర్సిటీలోని సైన్స్ కళాశాలలో ఎంఎస్సీ బయోటెక్నాలజీ, మైక్రో బయాలజీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ అనలెటికల్ కెమిస్ట్రీ, మేథమెటిక్స్, అప్లైడ్ మేథమెటిక్స్, ఫిజిక్స్ కోర్సులు ఉన్నాయి. ఈ కోర్సుల్లో చేరేందుకు ఆప్షన్లు నమోదు చేసుకోవాలి' అని ప్రొఫెసర్ సుజాత తెలిపారు.

11న 5కే మారథాన్ రన్

అరసవల్లి ఆగస్టు 6: యువతకు హెచ్ఐవీ/ఎయిడ్స్ గురించి అవగాహన కల్పించడంలో భాగంగా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 11న 5కే మారథాన్ పరుగు పందెం నిర్వహించనున్నట్టు డీఎంహెచ్‌వో మీనాక్షి తెలిపారు. మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో డీఎంహెచ్‌వో మీనాక్షి, డాక్టర్ శ్రీకాంత్, డీఎల్ఏటీవో ఆధ్వర్యంలో 5కె మారథాన్, క్విజ్‌పై వివిధ విభాగాలతో సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. 'శ్రీకాకుళం 80 అడుగుల రోడ్డులో 11న ఉదయం 5.30 గంటలకు కలెక్టర్ చేతుల మీదుగా 5కే రన్ ప్రారంభిస్తాం. మొదటి విజేతకు రూ.7వేలు, ద్వితీయ విజేతకు రూ.4వేలు బహుమతిగా అందజేస్తాం. క్విజ్ విజేతలకు మొదటి బహుమతి రూ.7వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు ఇస్తాం. ఉత్సాహవంతులైన యువతీ, యువకులు, ట్రాన్స్ జెండర్లు ఈ నెల 8వ తేదీలోగా 94944 74266 నెంబరుకు ఫోన్ చేసి పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాల'ని కోరారు. కార్యక్రమంలో డా.శ్రీధర్ ఎన్‌వైకే ఉజ్వల్, ఎం.ప్రసాదరావు, హెచ్ఐవీ/ఎయిడ్స్ అనుబంధ సంస్థలు, జిల్లాలోని వివిధ కళాశాలల ఆర్ఆర్‌సీ కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో మీనాక్షి

బడి బస్సుల భద్రత ఎంత?

- నిబంధనలు విస్మరిస్తున్న ప్రైవేటు పాఠశాలలు
- పరిమితికి మించి విద్యార్థులను ఎక్కిస్తున్న వైనం
- తరచూ ప్రమాదాలు.. ఆందోళనలో తల్లిదండ్రులు



● తాజాగా.. సోమవారం ఇచ్ఛాపురం పట్టణానికి కూతవేటు దూరంలో.. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు పరిధిలో ప్రైవేటు స్కూల్ బస్సు బోల్తా పడింది. 15 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. ఖాళీ స్థలంలో బోల్తా పడడంతో పెను ప్రమాదం తప్పింది. పొలంలో బోల్తాపడి ఉంటే పెద్దఎత్తున ప్రాణాలు పోయేవని స్థానికులు పేర్కొంటున్నారు.

● గతేడాది జూన్ 14న సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం వద్ద స్కూల్ బస్సు బోల్తాపడింది. ఈ ఘటనలో 12మంది విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. ఈ ఘటనతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు.

● 2021 అక్టోబరు 20న ఎచ్చెర్ల మండలం బడివానిపేట వద్ద చెరువులోకి స్కూల్ బస్సు దూసుకెళ్లి బోల్తాపడింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో ఐదుగురు విద్యార్థులు ఉండగా.. ఒక విద్యార్థి మృతి చెందాడు. తల్లిదండ్రులు ఆందోళన చెందారు.



● గత ఏడాది జూలై 27న ఇచ్ఛాపురం మండలం రత్తకన్న సమీపంలో ఆర్టీసీ బడి బస్సు ప్రమాదానికి గురైంది. ఇచ్ఛాపురం ఆదర్శ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సును ఏర్పాటు చేశారు. ఆ రోజు 20 మందితో వెళ్తున్న బస్సు ఒక్కసారిగా బురదలో కూరుకుపోయింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సును నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది.

(ఇచ్ఛాపురం)

..ఇలా తరచూ ప్రైవేటు పాఠశాలల బస్సులు బోల్తా పడుతూనే ఉన్నాయి. చాలా మంది విద్యార్థులు గాయపడుతుండగా.. కొన్ని సందర్భాల్లో కొంతమంది ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా చోటుచేసుకుంటున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అసలు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు బస్సులకు ఫిట్‌నెట్ పరీక్షలు చేయిస్తున్నారో లేదోనన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు రవాణా చార్జీలు అధికంగా వసూలు చేస్తున్నా.. భద్రతా ప్రమాణాలు పాటించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాహనాల్లో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కిస్తున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా 508 స్కూల్ బస్సులు ఉన్నాయి. విద్యాసంవత్సరం ప్రారంభంలోనే స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌ను పరిశీలించాలి. ఈ ఏడాది రవాణా శాఖ అధికారులు ప్రత్యేకడ్రైవ్ నిర్వహించి తనిఖీలు చేశారు. కాగా.. తనిఖీలు తూతూమంత్రంగా చేశారనే విమర్శలున్నాయి. కొన్ని పాఠశాలలు అనధికారికంగా బస్సులు నడుపుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయి. వాస్తవానికి సురక్షితమైన, కండిషన్‌లో ఉన్న బస్సులనే వినియోగించాలి. 15 ఏళ్ల కాలపరిమితి దాటిన బస్సులను వినియోగించరాదు. కానీ కొన్ని పాఠశాలలు పాత బస్సులకు రంగులు వేసి నడుపుతున్నట్టు ఆరోపణలున్నాయి.

● డ్రైవర్ల ఎంపిక కీలకం..

స్కూల్ బస్సుడ్రైవర్ ఎంపిక చాలా కీలకం. శిక్షణ పొంది.. హెవీడ్రైవింగ్ లైసెన్స్ కలిగి.. ఆరోగ్యంగా ఉన్న డ్రైవర్లనే ఎంపిక చేయాలి. ముందుగా వారి నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలి. కంటిచూపు సక్రమంగా ఉన్నవారిని, మూర్ఛ వంటి వ్యాధులు లేనివారిని ఎంపిక చేసుకోవాలి. అయితే నిష్ణాతులైన డ్రైవర్లకు అధిక వేతనం ఇవ్వాల్సి వస్తోందని కొన్ని యాజమాన్యాలు.. వయసు పైబడిన వారికి సైతం డ్రైవర్లుగా ఎంపిక చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి.

● ఆ నిబంధనలు తప్పనిసరి..

స్కూల్ బస్సులకు సంబంధించి 32 అంశాలతో కూడిన నిబంధనలు పాటించాలి. ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ తప్పనిసరి. బస్సులో విద్యార్థుల వివరాల పట్టిక నమోదు చేయాలి. బస్సు ముందు, వెనుక భాగాల్లో స్కూల్ బస్సు, ఆన్ స్కూల్ డ్యూటీ అని రాయాలి. బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్సు, ఎమర్జెన్సీ డోర్ ఏర్పాటు చేయాలి. అగ్నిప్రమాద నివారణ పరికరాలు అందుబాటులో ఉంచాలి. కిటికీలకు నెట్ తప్పనిసరిగా ఉంచాలి. బస్సు తలుపులకు లాకింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలి. బస్సులో పిల్లల కోసం సహాయకులను నియమించాలి. గంటకు 40 కిలోమీటర్ల వేగానికి మించకుండా స్పీడ్ గవర్నెన్స్ ఏర్పాటు చేయాలి. డ్రైవర్‌కు హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు నాలుగేళ్ల అనుభవం ఉండాలి. కానీ చాలా పాఠశాలల బస్సుల్లో ఇవేవీ అమలవుతున్న దాఖలాలు లేవు. జిల్లా అధికారులు స్పందించి పాఠశాలల బస్సుల్లో భద్రతపై దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇఫ్లూలో బీఏ(ఆనర్స్/ రీసెర్చ్) ప్రోగ్రామ్‌లు

హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఇఫ్లూ-సెంట్రల్ యూనివర్సిటీ)- బీఏ(ఆనర్స్/రీసెర్చ్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. షిల్లాంగ్, లఖ్‌నవూ ప్రాంతీయ క్యాంపస్‌లలో కూడా ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. సీయూఈటీ యూజీ 2024 స్కోర్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. ఏటా నిర్దేశిత కోర్సులు పూర్తిచేసి ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. ఏడాది కోర్సు పూర్తిచేసి యూజీ సర్టిఫికెట్, రెండేళ్ల కోర్సు పూర్తిచేసి యూజీ డిప్లొమా, మూడేళ్ల కోర్సు పూర్తిచేసి బీఏ డిగ్రీ, నాలుగేళ్లు చదివి బీఏ ఆనర్స్/రీసెర్చ్ డిగ్రీ పొందవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంగ్లీష్ ఒక సబ్జెక్ట్‌గా ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. దివ్యాంగులు, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. సీయూఈటీ యూజీ 2024 అర్హత పొంది ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 11
- **కౌన్సెలింగ్:** ఆగస్టు 20 నుంచి 22 వరకు
- **తరగతులు ప్రారంభం:** ఆగస్టు 23 నుంచి
- **వెబ్‌సైట్:** www.efluniversity.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/UMXeSxkలో చదవండి.

సీఐటీడీలో పోస్ట్ డిప్లొమా ఇన్ టూల్ డిజైన్



హైదరాబాద్-బాలానగర్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్(సీఐటీడీ)- 'పోస్ట్ డిప్లొమా ఇన్ టూల్ డిజైన్(పీడీటీడీ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. మొత్తం 35 సీట్లు ఉన్నాయి. రిటెన్ టెస్ట్, కౌన్సెలింగ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి డిప్లొమా ఇన్ మెకానికల్ ఇంజనీరింగ్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థుల వయసు 27 ఏళ్లు మించకూడదు.

స్పాట్ అడ్మిషన్స్: అభ్యర్థులు ఆగస్టు 19న డిప్లొమా బ్లాక్‌లో రిపోర్ట్ చేయాలి. ఉదయం తొమ్మిదిన్నర నుంచి పదిన్నర వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉంటుంది. మధ్యాహ్నం పదకొండు నుంచి పన్నెండున్నర వరకు రిటెన్ టెస్ట్ నిర్వహిస్తారు. సాయంత్రం రెండు గంటలకు ఫలితాలు విడుదల చేస్తారు. తరవాత కౌన్సెలింగ్ ప్రక్రియ ఉంటుంది.

- **స్పాట్ అడ్మిషన్స్ తేదీ:** ఆగస్టు 19
- **వేదిక:** రూమ్ నెంబర్ 102, డిప్లొమా బ్లాక్, సీఐటీడీ, బాలానగర్, హైదరాబాద్-500037.
- **వెబ్‌సైట్:** www.citdindia.org

ఎన్‌జీ రంగా వర్సిటీలో బీటెక్

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్‌ఏయూ)- ఎంపీసీ స్ట్రీమ్(ఫార్మర్స్ కోటా) కింద బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. ఏపీ ఈఏపీసెట్ 2024 స్కోర్, కౌన్సెలింగ్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ అనుబంధ వ్యవసాయ కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ప్రతి కాలేజీలో 85 శాతం సీట్లను స్థానికులకు కేటాయించారు. మిగిలిన 15 శాతం సీట్లకు తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజికల్ సైన్సెస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. తల్లిదండ్రుల పేరుమీద గానీ, అభ్యర్థి పేరు మీద గానీ కనీసం ఒక ఎకరం భూమి ఉండాలి. గ్రామీణ పాఠశాలల్లో కనీసం నాలుగేళ్లు చదివి ఉండాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 13
- **చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్.జీ.రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు-522034
- **వెబ్‌సైట్:** angrau.ac.in

దిక్సూచి DIKSUCHI

SCHOLARSHIP ALERT

Aspire

Description: Aspire Scholarship Program 2024-25 is a CSR initiative of SWAYAM Charitable Trust, a not-for-profit organization set up by Dr. Ajai Chowdhry and his family. The scholarship aims to provide financial support to underprivileged students pursuing B.Tech. courses at 11 prestigious engineering institutions across India.

Eligibility: Students joining the first-year of B.Tech. courses at any of the specified 11 institutions can apply.

- Annual family income of the applicants should not exceed INR 6 lakh from all sources.

Prizes & Rewards: Scholarship based on the actual fee structure to cover academic expenses, such as tuition fees, hostel fees, food, and related expenses.

Last Date to Apply: 10-09-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/ASPI2

Raman Kant Munjal

Description: The Raman Kant Munjal Scholarships 2024-25 is an initiative by the Raman Kant Munjal Foundation, supported by Hero FinCorp, that aims to help undergraduate students pursuing finance-related courses to pursue their dreams of a promising career and a better life.

Eligibility: Students enrolled in the first year of BBA, BFIA, B.Com. (H, E), BMS, IPM, B.A. (Economics), BBS, BBI, BAF, B.Sc. (Statistics), or any other finance-related degree courses are eligible.

- Applicants must have secured at least 80% marks in Classes 10 and 12.
- The annual family income of the applicants should be less than INR 4 lakh.
- Open for Indian nationals only.

Prizes & Rewards: Scholarship from INR 40,000 to INR 5,50,000 per year for three years

Last Date to Apply: 20-08-2024

Application mode: Online only

Short Url: ww.b4s.in/aj/RMKSP4

buddy4study.com

నవ్య | చిత్రజ్యోతి

బరువెక్కిన హృదయంతో...



గతంలో కుదుర్చుకున్న పలు చిత్రాల ఒప్పందం కారణంగా బిగ్‌బాస్ నుంచి స్వల్ప విరామం తీసుకుంటున్నట్టు అగ్రనటుడు కమల్ హాసన్ ప్రకటించారు. ఈ విషయాన్ని ఆయన మంగళవారం తన ఎక్స్ ఖాతాలో అధికారికంగా వెల్లడించారు. 'ఏడు సంవత్సరాల క్రితం ప్రారంభమైన ప్రయాణం నుంచి ఒక చిన్న విరామం తీసుకుంటున్నాననే విషయాన్ని బరువెక్కిన హృదయంతో ప్రకటిస్తున్నాను. బిగ్ బాస్ కారణంగానే మీ ఇళ్ళకు వచ్చి మిమ్మల్ని కలుసుకునే భాగ్యం నాకు లభించింది. మీరు అందించిన ఉద్వేగపూరిత, ఉత్సాభరిత మద్దతు, ఆదరణ కారణంగా బిగ్‌బాస్ తమిళ సీజన్ దేశంలోనే ఉత్తమ టెలివిజన్ రియాలిటీ షోలలో ఒకటిగా మారింది. ఒక ప్రెజెంటర్‌గా నేను వ్యక్తిగతంగా నేర్చుకున్న అనేక విషయాలను నిజాయితీగా మీతో పంచుకున్నాను' అని కమల్ హాసన్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి (చెన్నై)

క్రేజీ ప్రాజెక్ట్‌కు 9న శ్రీకారం



జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న చిత్రం ఈ శుక్రవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభం కానుంది. 'కే.జీ.ఎఫ్' చిత్రంతో దేశవ్యాప్తంగా క్రేజ్ సంపాదించుకున్న దర్శకుడు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా నటించే ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించనుంది. ఈ సినిమా గురించి నిర్మాతల్లో ఒకరైన రవిశంకర్ యలమంచి 'చిత్రజ్యోతి'తో మాట్లాడుతూ 'శుక్రవారం పూజా కార్యక్రమాలతో లాంఛనంగా సినిమాను ప్రారంభిస్తున్నాం. రెగ్యులర్ షూటింగ్ సెప్టెంబర్‌లో మొదలవుతుంది. ఎన్టీఆర్ అక్టోబర్ నుంచి షూటింగ్‌లో పాల్గొంటారు. ఈ లోపు ఆయన లేని సన్నివేశాలను చిత్రీకరిస్తాం. హీరోయిన్ ఎవరన్నది ఇంకా ఎంపిక చేయలేదు' అని చెప్పారు. ప్రస్తుతం తను నటిస్తున్న 'వార్ 2' చిత్రం షూటింగ్‌ను ఈలోగా పూర్తి చేసి, ప్రశాంత్ నీల్ చిత్రం మీద పూర్తిగా దృష్టి పెట్టనున్నారు ఎన్టీఆర్. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని అత్యంత భారీ వ్యయంతో నవీన్ యర్నేని, రవిశంకర్ యలమంచి నిర్మించనున్నారు. పూర్తి వివరాలను చిత్ర ప్రారంభోత్సవం రోజున వెల్లడిస్తారు.

ఇండస్ట్రీ ఏ ఒక్క ఫ్యామిలీ సొత్తు కాదు



'వీళ్ల తప్ప మరెవరూ ఉండరు' అంటూ మెగా ఫ్యామిలీపై చేస్తున్న విమర్శలపై నటుడు నాగబాబు స్పందించారు. సోమవారం 'కమిటీ కుర్రోళ్లు' సినిమా ప్రీ రిలీజ్ వేడుకకు విచ్చేసిన ఆయన మాట్లాడుతూ "సినిమా ఇండస్ట్రీలో ఎటు చూసినా మెగా ఫ్యామిలీదే ఆధిపత్యం.. కొందరి ఎదుగుదలను ఆ ఫ్యామిలీ అడ్డుకుంటోందని అని ఎంతో మంది సార్లు అనడం విన్నాను. అలా అనడం ముమ్మాటికీ తప్పు. మాకు అలాంటి ఫీలింగ్ లేదు. ఇండస్ట్రీ మా తాత సొత్తు కాదు.. మా నాన్న సామ్రాజ్యం కాదు. అలాగే నందమూరి ఫ్యామిలీది కాదు, అక్కినేని కుటుంబానిది కాదు. ఇండస్ట్రీ అందరికీ చెందినది. సినిమా కుటుంబ నేపథ్యం ఏమీ లేకపోయినా అడవి శేష్ వంటి హీరోలు తమ టాలెంట్‌తోనే పైకి వచ్చారు. వారికి ఎవరూ అడ్డం పడలేదుగా. ఇప్పుడు 'కమిటీ కుర్రాళ్లు' చిత్రంలో నటిస్తున్న వాళ్లు ఏ రేంజ్‌కి వెళతారో ఎవరన్నా ఊహించగలరా! ఈ రోజు సినిమాలే కాదు.. ఆర్టిస్టుల కోసం ఎన్నో ఓటీటీ వేదికలు ఉన్నాయి. మంచి కంటెంట్ ఉన్న సినిమాకి ట్రై చేయండి. రెగ్యులర్ సినిమాల్లో రొటీన్ క్యారెక్టర్స్ కోసం ప్రయత్నించకండి" అని చెప్పారు.

'దేవర' నటుడికి అరుదైన వ్యాధి



మలయాళ నటుడు షైన్ టామ్‌చాకో.. 'దసరా', 'రంగబలి' వంటి సినిమాలలో ప్రతినాయక పాత్రలతో తెలుగులోనూ పాపులర్ అయ్యారు. ఇప్పుడు ఆయన ఎన్టీఆర్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర'లోనూ విలన్‌గా కనిపించనున్నారు. ఇటీవల జరిగిన ఓ మీడియా సమావేశంలో.. తనకు అటెన్షన్ డెఫిసిటీ హైపర్ యాక్టివిటీ డిజార్డర్ (ఏ.డీ.హెచ్.డీ) ఉందని తెలిపారు. ఈ వ్యాధి ఉండే వారు ఇతరుల కంటే ప్రత్యేకంగా కనిపించడానికి ప్రయత్నిస్తారని.. అయితే ఇందుకు తానేం బాధపడట్లేదని.. దీన్నో పాజిటివ్ క్వాలిటీగా భావిస్తా అని చెప్పారు.


సినిమా చెట్టును తిరిగి బతికిస్తాం!



సినిమా చెట్టును శాస్త్రీయ పద్ధతిలో తిరిగి బతికించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు తూర్పుగోదావరి జిల్లా డీఎఫ్‌వో బి.నాగరాజు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామంలో గోదావరి ఒడ్డున ఉన్న సినిమా చెట్టు సోమవారం తెల్లవారుజామున పడిపోయిన సంగతి తెలిసిందే. ఈ చెట్టు కూలిపోయిందనే విషయం తెలుగు రాష్ట్రాల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. సోషల్ మీడియాలో రోజంతా ఇదే విషయం హాట్ టాపిక్‌గా మారింది. కాగా అమరావతి నుంచి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం డీఎఫ్‌వో బి.నాగరాజు, డీఆర్‌వో వేణుగోపాల్, ఎఫ్‌బీవో ఎం.కార్తీక్ ఈ సినిమా చెట్టును పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో నాగరాజు మాట్లాడుతూ పడిపోయిన చెట్టును సైంటిఫిక్‌గా తిరిగి బతికించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఆంధ్రజ్యోతి (కొవ్వూరు)

వామ్మో.. రూ.పది కోట్లా?




దక్షిణాదిలో కొంత కాలం పాటు అగ్ర నటిగా కొనసాగిన సమంత.. స్టార్ హీరోలకి ఏ మాత్రం తగ్గని రేంజ్‌లో పారితోషికం అందుకున్న సందర్భాలు ఉన్నాయి. అయితే లేటెస్ట్‌గా అందిన సమాచారం మేరకు.. ఆమె తీసుకునే పారితోషికం రూ.పది కోట్లకు చేరిందట. అదీ సినిమాకు కాదండోయ్. 'హనీ బన్నీ' అనే స్పై థ్రిల్లర్ వెబ్ సిరీస్‌కు. 'సిటాడెల్' అనే ఆంగ్ల వెబ్ సిరీస్‌కు భారతీయ వెర్షన్‌గా తెరకెక్కిన ఈ వెబ్ సిరీస్ కోసం రూ.పది కోట్ల రికార్డు పారితోషికం సమంత అందుకున్నారట. వరుణ్‌ధావన్‌తో కలసి నటించిన ఈ సిరీస్ నవంబర్ 7 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమ్ అవ్వనుంది. ఇంతకు ముందు కూడా ఓ ప్రాజెక్ట్ కోసం ఒక బాలీవుడ్ ప్రొడ్యూసర్ భారీ మొత్తం సమంతకు ఆఫర్ చేయగా.. ఆమె తిరస్కరించారని టాక్. ఆ ప్రొడ్యూసర్ సమంతకు భారీ పారితోషికంతో పాటు లాభాల్లో 25 శాతం వాటా కూడా ఆఫర్ చేశారట. సమంత ఆ చిత్రాన్ని అంగీకరించి ఉంటే అది ప్రస్తుతం ఆమె ఈ సిరీస్ కోసం తీసుకున్న రూ.పది కోట్ల కంటే ఎక్కువే అయ్యేది.

డజనుకు పైగా చిత్రాలు.. ఒకే రోజు!



ఒకే రోజు మూడు నాలుగు సినిమాలు విడుదల కావడం సర్వసాధారణమే. సంక్రాంతికో.. దసరాకో.. ఇలా ఆరు లేదా ఏడు సినిమాలు ఒకే రోజు విడుదలైన సందర్భాలు ఉన్నాయి. వీటిల్లో చాలా వరకూ భారీ బడ్జెట్ చిత్రాలే ఉంటాయి. మీడియం బడ్జెట్‌లో తయారైన చిత్రాలు కూడా ఒక రోజున ఐదారు విడుదలైన సందర్భాలు లేకపోలేదు. అయితే వచ్చే గురువారం (ఆగస్టు 15) నాడు ఒకటి కాదు రెండు కాదు .. దాదాపు డజనుకు పైగా దక్షిణాది చిత్రాలు వెండితెర పై సందడి చేయనున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవంతో పాటు లాంగ్ వీకెండ్ కూడా కలసి వస్తుండడమే ఈ సందడికి కారణం. ఆ సినిమాల వివరాల్లోకి వెళితే...



మాస్ మసాలా సినిమాలకు పెట్టింది పేరు రవితేజ. ఆయన నటించిన లేటెస్ట్ చిత్రం 'మిస్టర్ బచ్చన్'తో థియేటర్లలో జోష్ తీసుకురావడానికి దర్శకనిర్మాతలు సిద్ధంగా ఉన్నారు. ఇందులో రవితేజ, బిగ్ బీ అమితాబ్ ఫ్యాన్‌గా కనిపించనున్నారు. సినిమాలో ఆయన ఇన్‌కమ్ టాక్స్ అధికారి పాత్రను పోషించారు. . యాక్షన్‌తో కూడుకున్న ఈ మాస్ ఎంటర్టైనర్ అందరికీ నచ్చుతుందని చిత్ర బృందం ధీమాగా ఉంది. గతంలో రవితేజతో 'షాక్', 'మిరపకాయ్' వంటి చిత్రాలు తెరకెక్కించిన హరీశ్ శంకర్ దీనికి దర్శకుడు. ఇప్పటికే రిలీజైన టీజర్, పాటలు సినిమాపై అంచనాలను అమాంతం పెంచేశాయి. ఈ సినిమాలో రవితేజ వింటేజ్ లుక్, నూతన నటి భాగ్యశ్రీ బోర్సే అందాలు సినిమాకు ప్లస్ అవుతాయని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.




బంగారు గనుల నేపథ్యంలో...

'శివ పుత్రుడు', 'అపరిచితుడు' వంటి చిత్రాలతో తెలుగులోనూ పాపులర్ అయిన నటుడు విక్రమ్. ఆయన లేటెస్ట్‌గా నటించిన పీరియాడికల్ డ్రామా చిత్రం 'తంగలాన్'. 'మద్రాస్', 'కాలా' చిత్రాల ఫేమ్ పా.రంజిత్ దీనికి దర్శకత్వం వహించారు. 19వ శతాబ్దంలో కర్ణాటకలోని కోలార్ బంగారు గనుల కార్మికుల జీవితాల నేపథ్యంలో జరిగే కథగా ఈ సినిమాను తెరకెక్కించారు. ఈ సినిమాలో విక్రమ్‌తో పాటు పాత్రధారులందరూ విభిన్నమైన లుక్‌లో కనిపించనున్నారు. ఈ సినిమా అయినా విక్రమ్ విజయాల కొరతను తీరుస్తుందని ఆయన అభిమానులు ఆశిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన టీజర్, ట్రైలర్.. సినిమాపై మంచి బజ్‌ను క్రియేట్ చేశాయి.



డబుల్ ఎంటర్టైన్‌మెంట్



'ఇస్మార్ట్ శంకర్'తో 2019లో సూపర్ హిట్ కొట్టారు డైరెక్టర్ పూరి జగన్నాథ్, హీరో రామ్ పోతినేని. వారి కలయికలో ఈ సినిమాకు సీక్వెల్‌గా వస్తున్న 'డబుల్ ఇస్మార్ట్'పై భారీ అంచనాలు ఉన్నాయి. వరుస ఫ్లాపుల్లో ఉన్న పూరీ జగన్నాథ్, రామ్ పోతినేనికి ఈ చిత్ర విజయం చాలా కీలకం కానుంది. ఇప్పటికే రిలీజైన టీజర్, ట్రైలర్, సాంగ్స్ సినిమాపై అంచనాలను పెంచేసేలా చేశాయి. యాక్షన్ సన్నివేశాలకు థియేటర్స్‌లో పూనకాలు గ్యారంటీ అని చిత్ర బృందం ధీమాగా ఉంది. పూరి మార్క్ డైలాగ్స్‌ను తెలంగాణ యాసలో రామ్ పలికిన తీరు.. సంజయ్ దత్ ప్రతినాయకుడిగా నటిస్తుండడం, మణిశర్మ సంగీతం సినిమాకు ప్రధానాకర్షణగా ఉండనున్నాయి.

'ఆయ్' అంటూ సందడి

గోదావరి యాస నేపథ్యంలో.. ఇప్పటికే ఎన్నో చిత్రాలు వచ్చాయి. ఆ కోవలోకి చెందిన చిత్రమే 'ఆయ్'. 'మేం ఫ్రెండ్సండి' ట్యాగ్‌లైన్. ఫుల్ లెంగ్త్ వినోదం గ్యారంటీ అంటూ ప్రచార చిత్రాలతోనే అందరి దృష్టిని ఆకర్షించిన ఈ సినిమాను అంజి కంచిపల్లి తెరకెక్కించారు. నార్నే నితిన్, నయన్ సారిక ఇందులో హీరో హీరోహీరోయిన్లుగా నటించారు. ఈ రొమాంటిక్ కామెడీ చిత్రం నుంచి విడుదలైన టీజర్, ట్రైలర్, సాంగ్స్‌తో సినిమాకు పాజిటివ్ బజ్ వచ్చింది.

అదే రోజున ఈ చిత్రాలు కూడా...

నటనా ప్రాధాన్యం ఉన్న పాత్రలకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండే కీర్తి సురేశ్.. కయల్విజి అనే పాత్రలో, హిందీ రాని తమిళమ్మాయిగా.. నటించిన తమిళ చిత్రం 'రఘుతాత'.. 'ఎవడే సుబ్రమణ్యం', 'కల్యాణ వైభోగమే' ఫేమ్ మాళవిక నాయర్ నటించిన 'క్రిష్ణమ్ ప్రణయ సఖీ' అనే కన్నడ సినిమా.. హిందీ చిత్రం 'అంధాధూన్' రీమేక్‌గా తమిళంలో తెరకెక్కిన 'అందగాన్'.. 'డిమోంటీ కాలనీ' అంటూ తెలుగు వారిని భయపెట్టిన తమిళ హారర్ చిత్రానికి కొనసాగింపుగా వస్తున్న 'డిమోంటీ కాలనీ 2'.. కన్నడ నటుడు శివరాజ్‌కుమార్ నటించిన థ్రిల్లర్ 'భైరతి రణగల్'.. భావన నటించిన 'హంట్' అనే మలయాళ హారర్ థ్రిల్లర్.. 'దృశ్యం' సినిమా సిరీస్‌తో నేషనల్‌వైడ్ గుర్తింపు పొందిన జీతూ జోసెఫ్ తెరకెక్కించిన కామెడీ ఎంటర్టైనర్ 'నునకుజి'.. 'వాజా' అనే మలయాళ కామెడీ చిత్రం కూడా అదే రోజు బాక్సాఫీస్ వద్ద ఇతర సినిమాలతో పోటీ పడుతున్నాయి. ఈ సినిమాల్లో ఏవి ప్రేక్షకుల ఆదరాభిమానాలు దక్కించుకుంటాయో ఈ నెల 15 వరకు వేచి చూడాల్సిందే.

పెద్ద విజయం కోసం... చిన్న కథ

వినోదాత్మక చిత్రాలతో ఓ వైపు అలరిస్తూనే.. ప్రయోగాత్మక చిత్రాలు, వైవిధ్యమైన పాత్రలకు ఎప్పుడూ ముందుండే నటుడు ప్రియదర్శి ఆయన చాణక్య వర్మ అనే పాత్రతో స్కూల్ టీచర్‌గా నటించిన చిత్రం '35 చిన్న కథ కాదు'. సెలక్టివ్‌గా సినిమాలు చేసే నివేదా థామస్ ఇందులో ఓ మధ్య తరగతి ఇల్లాలి పాత్రను పోషించారు. విశ్వదేవ్, భాగ్యరాజ్ కీలక పాత్రల్లో నటించారు. నంద కిశోర్ ఈమని దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో ఇంటిల్లిపాదినీ అలరించే వినోదంతో పాటు గుండెని బరువెక్కించే భావోద్వేగాలూ ఉన్నాయని టీజర్ ద్వారా తెలుస్తోంది.



సిద్ధు జొన్నలగడ్డ 'తెలుసు కదా'



యువ కథానాయకుడు సిద్ధు జొన్నలగడ్డ నటించే కొత్త చిత్రం 'తెలుసు కదా' రెగ్యులర్ షూటింగ్ మంగళవారం ప్రారంభమైంది. స్టైలిస్ట్ నీరజ కోన ఈ చిత్రంతో దర్శకురాలిగా పరిచయమవుతున్నారు. 30 రోజుల పాటు జరిగే ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలు, పాటలు చిత్రీకరిస్తామని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ చెప్పారు. తొలి రోజు షూటింగ్‌లో రాశీ ఖన్నా కూడా పాల్గొన్నారు. శ్రీనిధి శెట్టి మరో కథానాయిక. వైవా హర్ష ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమాకు తమన్ సంగీతాన్ని, జ్ఞానశేఖర్ బాబా ఛాయాగ్రహణాన్ని అందిస్తున్నారు.

ప్రేమికులు రిలేట్ అయ్యేలా...



విజయ్‌శంకర్, విషిక జంటగా నటించిన 'పాగల్ వర్సెస్ కాదల్' చిత్రం ఈ నెల 9న విడుదల కానుంది. మంగళవారం ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగింది. రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ ఇదనీ, ప్రేమలో ఉన్న ప్రతి లవర్ రిలేట్ చేసుకొనేలా సినిమా ఉంటుందని విజయ్‌శంకర్ చెప్పారు. తను పోషించిన పాత్ర చూశాక అమ్మాయిలు తమ బాయ్‌ఫ్రెండ్స్‌ని ఇబ్బంది పెట్టరని హీరోయిన్ విషిక చెప్పారు.

యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్



సాగర్, శ్రుతి శంకర్ జంటగా నటించిన 'కాలం రాసిన కథలు' చిత్రం సెన్సార్ పూర్తి చేసుకుని ఈ నెల 29న విడుదలకు సిద్ధమైంది. యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని మచిలీపట్నం పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించారు. యం. యన్.వి. సాగర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు.

కొత్తగా..

పోలీస్ ఆఫీసర్‌గా విశ్వక్ సేన్



విభిన్న పాత్రలతో అలరిస్తున్న విశ్వక్ సేన్ ఇప్పుడు పోలీస్ ఆఫీసర్‌గా నటించనున్నారు. 'దసరా' తో భారీ బ్లాక్ బస్టర్‌ను అందించిన సుధాకర్ చెరుకూరి ఈ చిత్ర నిర్మాత. శ్రీధర్ గంటా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. 'ఎవ్రీ యాక్షన్ ఫైర్స్ ఏ రియాక్షన్' అనేది సినిమా ట్యాగ్‌లైన్. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే పొలిటికల్ యాక్షన్ డ్రామా ఇదనీ, విశ్వక్ సేన్ పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తారని దర్శకనిర్మాతలు చెప్పారు. విశ్వక్ సేన్‌కు ఇది 13వ సినిమా.

అలరించే కుర్రోళ్లు



అంతా కొత్త వారితో నిర్మించిన 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం ఈ నెల 9న విడుదల కానుంది. యదు వంశీ దర్శకుడు. తెలుగు రాష్ట్రాల్లో వంశీ నందిపాటి విడుదల చేస్తున్నారు. సోమవారం జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో వరుణ్ తేజ్, సాయిదుర్గ తేజ్, అడవి శేష్, నాగబాబు, వెంకీ అట్లూరి తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో చిత్ర సమర్పకురాలు నిహారిక కొణిదెల మాట్లాడుతూ 'పదిహేను మంది కొత్త ఆర్టిస్టులను పరిశ్రమకు అందిస్తున్నాను..అనే తృప్తి నాకు ఉంది. చిత్ర దర్శకుడు వంశీ 'పేరు ఇకపై ఎక్కువగా వినిపిస్తుంది' అని చెప్పారు. చిత్రం పెద్ద హిట్ కావాలని అతిథులు కోరారు.

పర్యావరణ పరిరక్షణ కోసం సైకిల్ యాత్ర



జలుమూరు, ఆగస్టు 6: పర్యావరణ పరిరక్షణకు 19 రాష్ట్రాల్లో సైకిల్ యాత్ర చేపడుతున్నట్లు సుప్రియదాస్ అన్నారు. మంగళవారం సైకిల్ యాత్ర సారవకోటకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రయాణాల్లో కూడా జాగ్రత్తలు పాటించి సురక్షితంగా ప్రయాణించాలన్నారు. మాళవ కూడలి వద్ద ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి భార్య మాజీ జెడ్పీటీసీ బగ్గు సుగుణమ్మ కలిసి సైకిల్ ప్రయాణంలో ఏర్పాట్లు, తీసుకుంటున్న జాగ్రత్తలను అడిగి తెలుసుకున్నారు. సుప్రియదాస్‌ను అభినందించారు. ఈ సైకిల్ యాత్ర విజయవంతం కావాలని ఆమె ఆకాంక్షించారు.

విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయండి

సుసరాం(పోలాకి): ఆంధ్రప్రదేశ్ టీచర్స్‌ఫెడరేషన్ 80 వసంతాల వేడుక సందర్భంగా విజయనగరంలో నిర్వహించనున్న 20వ విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ (1938) రాష్ట్రసహాధ్యక్షుడు చింతాడ దిలీప్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ కిల్లి కృష్ణారావు, బమ్మిడి వెంకటనాగజితేంద్ర, మూల శ్రీనివాసరావు కోరారు. మంగళవారం మండలంలోని పలు పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులకు కరపత్రాలిచ్చి ఆహ్వానం పలికారు. సుసరాం ఉన్నత పాఠశాలలో హెచ్ ఎం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో తీసుకువచ్చిన 117 జీవోను రద్దుచేయాలని, ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుండి మినహాయించాలని, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు.

2023 అటవీ సంరక్షణ చట్టం రద్దు చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

హరిపురం: అటవీ సంరక్షణ చట్టం 2023ను రద్దు చేయాలని ఏఐకేఎంఎస్, ఏఐటీఎఫ్ జిల్లా కమిటీలు కోరాయి. ఈ మేరకు మందస మండలం కొండలోగాంలో మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు పోతనపల్లి కుసుమ, గొరకల బాలకృష్ణ మాట్లాడుతూ.. ఈనెల 9న ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీ హక్కుల రక్షణకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ చేపట్టి హక్కుల రక్షణకోసం ఉద్యమించాలన్నారు. కార్యక్ర మంలో ప్రజా సంఘాల నాయకులు సార జగన్, సవర సీతమ్మ, చంద్రమ్మ, కుమార్, పున్నయ్య సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీని అభినందించిన టీడీపీ నేతలు



డీఎస్పీ శ్రీనివాసరావును సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

పలాస: కాశీబుగ్గ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన పి.శ్రీనివాసరావును పలాస టీడీపీ నాయకు లు అభినందించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ కోట్ని దుర్గాప్రసాద్ మంగళవారం కలిసి దుశ్శాలువతో సత్కరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. డీఎస్పీని కలిసిన వారిలో నేతలు వై. మోహనరావు, చంద్రమౌళి, అనిల్‌శర్మ, ధనుంజయ్, మన్మధరావు, కామేశ్వరరావు, కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించాలని ధర్నా



వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

కొత్తూరు: ఉపాధి హామీ వేతనదారులకు వేతనాలివ్వాలని, లేకుంటే తిండైనా పెట్టాలని ఏపీ వ్యవసాయ కార్మికసంఘం, ఆదివాసీ గిరిజన సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గొట్టి పల్లి పంచాయతీ సచివాలయం వద్ద ఖాళీ కంచాలతో మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం సచివాలయం వెల్ఫేర్ అధికారి లక్ష్మీకుమారికి వినతిపత్రం అందించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శిర్ల ప్రసాద్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న మాట్లాడు తూ.. ఉపాధి పనులు చేసిన వేతనదారులకు 8 వారాలుగా వేతనం చెల్లించలేదన్నారు. దీంతో వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో వేతనదారులు రామారావు, లక్ష్మి, శివ, వెంకటరావు, గణపతి, రమణ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు రోడ్డులేక అవస్థలు



టెక్కలి: రావివలస గ్రామంలోని శ్మశానవాటికకు రహదారి సౌకర్యం గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. అసలే వర్షాకాలం.. పైగా రోడ్డు లేకపోవడంతో గట్లపైనుంచి మృతదేహాలను తీసుకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణంతో పాటు శ్మశాన వాటికలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని వరు కోరుతున్నారు.

రైస్‌మిల్లు వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

మందస: రైస్‌మిల్లు వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని చైతన్య రైస్‌మిల్లు, ఆయిల్‌మిల్లు వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మందసలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీటీ కృష్ణయ్యకు వినతి పత్రం అందజేశారు. ఒప్పంద వేతనాలను వెంటనే అమలు చేసేలా చర్యలు చేపట్టాలని, కార్మికులకు బీమా సదుపాయం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎన్.గణపతి, పి.దేవేంద్ర, కె.కేశవరావు, కె.బాలకృష్ణ పాల్గొన్నారు.

పారదర్శక ధ్రువీకరణకే ప్రజావేదిక

పాతపట్నం: ఉపాధి హామీ పథకం పనులు, వేతనాల చెల్లింపులు, సామాజిక భద్రత పింఛన్ల పంపిణీలో పారదర్శక ధ్రువీకరణకే సామాజిక తనిఖీ ప్రజావేదికల లక్ష్యమని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు అన్నారు. స్థానిక ఉపాధి కార్యాలయం ఆవరణలో మంగళవారం సామాజిక తనిఖీ ప్రజా వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పథకానికి వినియోగించే ప్రజాధనం దుర్వినియోగం అవకుండా ప్రజాప్రతినిధుల సమన్వయంలో పనులు చేయించాలని అధికారులకు సూచించారు. ఉపాధి పనుల్లో దుర్వినియోగానికి పాల్పడి ఉంటే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఏపీడీలు పి.రాధ, మురళీకృష్ణ, జిల్లా విజిలెన్స్ అధికారి బి.లవరాజు, ఎంపీడీవో కె.రామకృష్ణరాజు, ఎస్సార్పీ ఇ.పున్నపునాయుడు, ఏపీఎం టి.మనో రత్నం తదితరులు పాల్గొన్నారు.

బురదలో కూరుకుపోయిన బస్సు చక్రం

- తప్పిన పెనుప్రమాదం



రోడ్డు పక్కన మట్టిలో దిగిపోయిన బస్సు

పాతపట్నం: ఆల్ ఆంధ్రా రోడ్డులో వెళుతున్న ఆర్టీసీ బస్సు స్థానిక మహేంద్ర డిగ్రీకళాశాల సమీపంలో మంగళవారం రోడ్డు పక్కకు దిగి మట్టిలో కూరుకుపోయింది. వివరాలిలా ఉన్నాయి.. స్థానిక ఆలాంధ్ర రోడ్ పక్క ఓ ప్రైవేటు సెల్ కంపెనీ గొట్టాల ఏర్పా టుకు తీసిన గోతుల్లో మట్టి వేసి కప్పారు. అయితే మంగళవారం మధ్యాహ్నం కురిసిన వర్షాని కి మట్టి లోపలకువెళ్లి పోయింది. అటుగా వచ్చిన ఆర్టీసీ బస్సు బీటీ రోడ్డు పక్కకు దిగి మట్టి లో కూరుకుపోయింది. డ్రైవర్ అప్ర మత్తంగా వ్యవహరించడంతో పెనుప్రమాదం తప్పింది. రోడ్డుకు అడ్డంగా బస్సు నిలిచిపోయవడంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

ఐతమ్‌లో పుస్తకావిష్కరణ

టెక్కలి: ఐతమ్ ఇంజనీరింగ్ కళాశాలలో బీఎస్‌అండ్‌హెచ్ విభాగంలో అధ్యాపకులు మామిడి పాపినాయుడు, వెలగల రాంబాబు, మొదలవలస కృష్ణప్రసాద్, నడిమింటి శైలజ నూతనంగా రచిం చిన 'ఏ డబుల్ విజన్ ఇన్ ఝంపా లహరీస్ వర్క్స్' అనే పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశాలకు వలస వెళ్లేవారు పడుతున్న ఇబ్బందులు, ఎదుర్కొంటున్న జాతి వివక్ష తదితర అంశాలపై ఝంపా లహరి నవల ఆధారంగా అధ్యయనం చేసి రచయితలు ఈ పుస్తకాన్ని రచించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎస్ శ్రీనివాసరావు, అసోసియేట్ డీన్ కె.వేణుగోపాల్, హెచ్‌వోడీలు ఎం.రమణయ్య, ఎంవీ రత్నమణి తదితరులు పాల్గొన్నారు.

జీడి పిక్కలకు మద్దతు ధర ప్రకటించాలి

- ఎమ్మెల్యే శిరీషకు రైతు సంఘం నేతల వినతి



ఎమ్మెల్యే గౌతు శిరీషకు వినతిపత్రం అందిస్తున్న జీడి రైతుసంఘ నాయకులు

పలాస: జీడి పిక్కలకు కనీస మద్దతు ధర ప్రకటించాలని, రైతు సేవా కేంద్రాల ద్వారా 80 కిలోల జీడి పిక్కల బస్తా రూ.16 వేలకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని జీడి రైతుసంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే గౌతు శిరీషను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో జీడి రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. పలాస కేంద్రంగా జీడి బోర్డు ఏర్పాటు చేయాలని, బ్యాంకుల ద్వారా స్కేల్‌ఆఫ్ ఫైనా న్స్ జీడి రైతులకు అమలు చేయాలన్నారు. స్వదేశీ జీడి పిక్కలు కొనుగోలు అనంతరమే విదేశీ పిక్కలు కొనుగోలు చేసే విధంగా చొరవ తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో జీడి రైతుసంఘ నాయకులు కుత్తుమ వినోద్ కుమార్, గణపతి, రమేష్, భాస్కర్, రాఘవరావు, మోహన రావు, రామకృష్ణ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే కిడ్నీ పరిశోధన కేంద్రం

పలాస: కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల ఆసుపత్రిలో రూ.53 కోట్లతో భవనాలు నిర్మించి విడిచి పెట్టారని, పరికరాల కోసం రూ.25 కోట్లు మంజూరు కాగా ఇంకా రూ.11 కోట్ల విలువైన పరికరాలు రాలేదని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మంగళవారం ఏపీ మెడికల్ సర్వీసెస్ ఇన్ ఫ్రా స్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్‌ఐడీసీ) అధికారులు ఎమ్మెల్యేను ఆమె చాంబర్ లో మర్యాదపూర్వకంగా కలుసుకుని చర్చించారు. కిడ్నీ పరిశోధనా కేంద్రం మంజూరు, నిధుల విడుదల టీడీపీ హయాంలోనే జరిగాయన్నారు. త్వరితగతిన పరికరాలు తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని వారికి సూచించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఈఈ సత్య ప్రభాకర్, డీఈఈ త్రిమూర్తులు, జేఈలు నరేంద్ర, ధనుంజయ్, సాయిసురేంద్ర, బీఎం దామోదరరావు ఉన్నారు.

ఆటో యూనియన్ సభ్యుల శ్రమదానం



చెట్ల కొమ్మలను తొలగిస్తున్న యూనియన్ సభ్యులు

వజ్రపుకొత్తూరు: చినవంక జంక్షన్ నుంచి తాళభద్ర వరకు రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, చెట్ల కొమ్మలను ఆటో యూనియన్ సభ్యులు మంగళవారం శ్రమదానం చేసి తొలగించారు. పిచ్చి మొక్కలతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్న నేపథ్యంలో పల్లిసారధి అసిరిపోలమ్మ ఆటో యూనియన్ సభ్యులు శ్రమదానం చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు తామాడ సోమేశ్వరరావు, యూనియన్ ప్రతినిధులు పోతనపల్లి కోదండ రావు, సాన కృష్ణారావు, తామాడ లక్ష్మిపతి, రెయ్య హేమంత్, ఎం.మధు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును శుభ్రం చేసిన యువత

సంతబొమ్మాళి: గ్రామ మెయిన్ రోడ్డుపై కొద్ది నెలలుగా చెత్త పేరుకుపోవడంతో జగన్నాధపురం కాశీ విశ్వేశ్వర యువజన సంఘ సభ్యులు మంగళవారం శ్రమదానం చేసి శుభ్రపరిచారు. మెయిన్ రోడ్డుపై బురద పేరుకుపోవడంతో దానిని తొలగించారు. ఈ సందర్భంగా యువకులను గ్రామ స్థులు అభినందించారు.



మెయిన్ రోడ్డును శుభ్రం చేస్తున్న యువకులు

యంత్రాలతోనే రైతులకు భరోసా: ఏడీఏ మధు



యంత్ర సాయంతో నాట్లు వేయిస్తున్న ఏడీఏ మధు

హరిపురం: రైతులకు యంత్రపరికరాలతోనే భరోసా లభించి ఆర్థిక తోడ్పాటు అందుతుందని ఏడీఏ ఎల్.మధు అన్నారు. బిన్నలలో ప్రయోగాత్మకంగా వరి యంత్రంతో నాట్లు వేశారు. ఆదర్శ రైతు మార్పు విక్రమ్ అధికారుల సలహాలతో వరి నారు వేసి యంత్రాలతో నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఆధునిక యంత్ర పరి జ్ఞానాన్ని రైతులు అందిపుచ్చుకోవాలని కోరారు. కూలీల సమస్య తీరడంతో పాటు సమయం ఆదా అవుతుందని, ఖర్చులు తగ్గి రైతులకు గిట్టుబాటు లభిస్తుందన్నారు. వచ్చే ఏడాది నాట్లు మిషన్‌తో నాటే కార్యక్రమాన్ని విస్తరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఈవో జగ్గారావు, మార్పు మాధవరావు, ప్రవళిక, వ్యవసాయ శాఖ సహాయ కులు పాల్గొన్నారు.

'ఈ పంట' నమోదులో నిర్లక్ష్యం వద్దు

ఎల్.ఎన్.పేట: గ్రామాల్లో రైతులు పండిస్తున్న పంటల నమోదుకు చేపడుతున్న ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని వ్యవసాయాధికారి పి.లత్శ్రీ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం అగ్రికల్చర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ ఏడాది ఖరీఫ్ పంటకు సంబంధించి అగ్రికల్చర్ అసిస్టెంట్లు సకాలంలో ఈపంట నమోదును పూర్తి చేయాలన్నారు. ప్రకృతిపరంగా పంటలకు నష్టం వాటిల్లినప్పుడు ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం ఈపంట నమోదై తేనే వర్తిస్తుందన్నారు. అందువల్ల రైతులు నష్టపోకుండా ఈపంట నమోదును చేపట్టాలన్నారు. సమావేశంలో అగ్రి కల్చర్ అసిస్టెంట్లు బి.సాయికుమార్, బాలచంద్రుడు, రాకేష్, షన్ముఖరావు, పావని, ఎన్.చాందిని తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదుతో మేలు

నరసన్నపేట: ఈఏడాది ఖరీఫ్‌లో రైతులు పండించే పంటలను క్షేత్రస్థాయిలో నమోదు చేసే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏవో సునీత అన్నారు. మంగళవారం ఈ క్రాప్ నమోదు ను తామరాపల్లిలో ప్రారంభించారు. రైతులు గ్రామాల్లోని ఆర్బీకేలకు ఆధార్, 1బీ అడంగల్‌తో పాటు ఆధార్ నెంబరు అనుసంధానం చేసిన సెల్‌ఫోన్ తీసుకువెళ్లి పంట నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో శిరీష తదితరులు పాల్గొన్నారు.

మేలైన వ్యవసాయంతో అధిక దిగుబడి

జలుమూరు: మేలైన వ్యవసాయంతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ ఏడీ రవీంద్రభారతి అన్నారు. అక్కురాడలో వెలమల రామరాజు రైతు పొలంలో పొలంబడి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పొలంలో స్వర్ణ రకం వరుసక్రమంలో వరినాట్లు వేసి రైతులకు అవగాహన కలిగించారు. నారు చివర్లు తుంచి నాటాలన్నారు. దీనివల్ల కాండం తొలుచు పురుగును నివారించవచ్చన్నారు. ఏవో తదితరులు పాల్గొన్నారు.

డిపాజిట్లను తక్షణం చెల్లించండి

- సహారా బాధితులు, ఏజెంట్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సత్యరాజు



మాట్లాడుతున్న ఏజెంట్ల సంఘం నేతలు

కాశీబుగ్గ: సహారా ఖాతాదారులకు డిపాజిట్ మొత్తాలను చెల్లించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, తక్షణమే సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేసి ఆదుకోవాలని సహారా బాధితులు, ఏజెంట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బైపల్లి సత్యరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కాశీబుగ్గ సహారా కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడు తూ.. డిపాజిట్లను చెల్లించకుంటే స్వచ్ఛంద మరణాలే శరణ్యమని ఆవేదన వ్యక్తంచేశారు.12 ఏళ్లుగా సహారా సంస్థ చేసిన దారుణానికి సామాన్యులైన ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారని, ఏజంట్లుగా తాము గ్రామాల్లో తిరగలేక పోతున్నామన్నారు. కట్టిన డబ్బులను ఇవ్వాలని మాపై ఒత్తిడి తీసుకువస్తున్నారని ఆవేదన చెందారు. దేశంలో 13 కోట్ల మంది ఖాతాదారు లున్నారని, 2023 జూలైలో ఖాతాదారులు చెల్లించిన డబ్బుల కు 15 శాతం కలిపి డబ్బులు చెల్లించాలని సుప్రీంకోర్టు ఆదేశించి ఏడాదైనా నేటికీ పంపిణీ చేయలేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు చింతాడ మాధవరావు, విశ్వ నాథం, రాంచరణ్, చంద్రమౌళి, సుందర్, సూర్యారావు, ధనరాజ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఆసరాగా నిలుస్తాం

పాతపట్నం: నిరుద్యోగ యువతకు ఆసరాగా నిలవడమే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు నిర్వహిం చనున్నట్లు జనసేన నాయకుడు కొరకాన రవికుమార్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళ వారం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించిందని, దీంతో యువత ఆనందం వ్యక్తంచేస్తున్నారన్నారు. పాతపట్నం నియోజకవర్గ నిరుద్యోగ యువతకు ఆసరాగా నిలిచే లక్ష్యంతో ఈనెల 9వ తేదీ నుంచి ఉచిత డీఎస్సీ మెగా శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జనసేననాయకుడు క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల పరిశీలన

టెక్కలి: స్థానిక పట్టుమహాదేవి కోనేరు గట్టును ఆక్రమించి ఏర్పాటు చేసిన నిర్మాణాలను మంగళవారం రెవెన్యూ అధికారులు పరిశీలించారు. స్వచ్ఛందంగా తొలగించాలని, లేదంటే తామే తొలగిస్తా మని వారు హెచ్చరించారు. కోనేరు గట్టుపై ఎటువంటి ఆక్రమ నిర్మాణాలు లేకుండా చర్యలు తీసు కుంటామని వారు తెలిపారు. ఇప్పటికే ఆక్రమణలు పుట్టగొడుగుల్లా వెలుసుకొస్తు న్నాయని, వీటిని తొలగించనున్నామని స్పష్టంచేశారు.



అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు



శాకంబరిగా శాంతమ్మతల్లి

నరసన్నపేట: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని స్థానిక శాంతమ్మ తల్లి అమ్మవారు మంగళవారం శాకంబరిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

వితంతు పింఛన్‌పై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి తేజా చక్రవర్తి

టెక్కలి: వితంతువుల కోసం రూపొందించబడిన పింఛన్ పథకంపై అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి మల్లా తేజాచక్రవర్తి అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో అర్హులైన వితంతు పింఛన్‌దారులతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పింఛన్‌కు ఏ రకంగా దరఖాస్తు చేసుకోవాలి, ఏయే పత్రాలు ఉండాలనే విషయమై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఏవో రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నరసన్నపేట: మత్స్యకారులకు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఫిషరీస్ శాఖ ఏడీ టి.సంతోష్‌కుమార్ అన్నారు. మంగళవారం ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్‌లో మత్స్యకార సహకార సంఘాలకు ఒక రోజు శిక్షణ శిబిరం నిర్వహించారు. చేపల ఉత్పత్తి పెంపొందించేందుకు ఏవిధమైన చర్యలు తీసుకోవాలో వివరించారు. గ్రామాల్లో సహకార సంఘాలను ఏర్పాటు చేసుకుని ప్రభుత్వం అందించే రాయితీలను సంఘాల ద్వారా మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని ఎఫ్‌డీవో సురేష్‌కుమార్ అన్నారు. కార్యక్రమంలో నరసన్నపేట, శ్రీకాకుళం నియోజవర్గాల మత్స్యకార సహకార సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఎండల మల్లన్న ఆదాయం రూ.1.83 లక్షలు

టెక్కలి: రావివలస ఎండమల్లికార్జునస్వామి ఆదాయం రూ.1,83,252 వచ్చినట్లు ఈవో వాకచర్ల రాధాకృష్ణ తెలిపారు. ఆలయంలోని హుండీని మంగళవారం దేవదాయశాఖ అధికారుల సమక్షంలో లెక్కించారు. 151 రోజులకు గాను ఈ మొత్తం వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆమదాలవలస దేవదాయశాఖ ఈవో టి.రవి, మాజీ సర్పంచ్ బడే జగదీష్, సిబ్బంది గోవింద్, శివ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో 6302 సభ్యత్వాల నమోదు

వజ్రపుకొత్తూరు: పలాస నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో 6,302 జనసేన సభ్యత్వాలు నమోదు చేశామని నియోజకవర్గ సమన్వయకర్త వి.దుర్గారావు తెలిపారు. జూలై 18 నుంచి ఈనెల 5 వరకు క్రియాశీలక సభ్యత్వాలను స్వీకరించామన్నారు. ఒక్క పెద్దమురహరిపురంలోనే 607 సభ్యత్వాలు నమోదయ్యాయన్నారు.

శాసనమండలి చైర్మన్‌కు సత్కారం

నందిగాం: రాష్ట్ర శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజ్‌ను మంగళవారం వైసీపీ నేతలు సత్కరిం చారు. ఇచ్ఛాపురం నుంచి తిరుగు ప్రయాణమైన చైర్మన్‌కు నందిగాం హైవేపై వైసీపీ శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, జె.జయరాం, సీహెచ్.జోగారావు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జ్వరాల సర్వే

నందిగాం: కాపుతెంబూరులో జ్వరాలపై ఇంటింటి సర్వే కొనసాగుతోంది. మంగళవారం నందిగాం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.అనితకుమారి ఆధ్వర్యంలో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం తదితరులు ఇంటింటికీ వెళ్లి జ్వర పీడితుల వివరాలు సేకరించి మందులు పంపిణీ చేశారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

డీకే శివకుమార్‌ను కలిసిన కృపారాణి



టెక్కలి: కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపా రాణి మంగళవారం కలుసుకున్నారు. బెంగుళూరులో ఆయనను కలిసి రాష్ట్ర రాజకీయాలపై చర్చించారు. అనంతరం శివకుమార్‌కు దుశ్శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఆయన ను కలిసిన వారిలో డాక్టర్ కిల్లి రామ్మోహనరావు, విక్రాంత్ ఉన్నారు.

ఎంఎంఎస్ కార్యవర్గం ఎన్నిక

కోటబొమ్మాళి: స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం మండల మహిళా సమాఖ్య కార్య వర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలిగా నిమ్మాడకు చెందిన ఎం.సుశీల, ఉపాధ్యక్షురాలిగా పి.వరలక్ష్మి (కిష్టుపురం), కోశాధికారిగా ఎం.రమణమ్మ (ప్రకాశనగర్ కాలనీ), కార్యదర్శిగా బి.అన్నపూర్ణ (శ్రీజగన్నాథపురం), సంయుక్త కార్యదర్శిగా ఎం.సీతమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా హనుమంతు శార్వాణి వ్యవహరించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

నరసన్నపేట: వైసీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టకుంటే వాటిని రద్దు చేయడం జరుగుతుందని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. మంగళవారం జమ్ము గ్రామంలో మూడో లే అవుట్‌ను గృహనిర్మాణశాఖ, సచివాలయ సిబ్బందితో కలిసి పరిశీలించారు. పేదలకు అందించే ఇళ్లను వందరోజుల్లో పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులు మాత్రమే ఇళ్లను నిర్మిం చాలని, బినామీలు ఉంటే వెంటనే ప్రభుత్వానికి అప్పగించాలన్నారు. 558 ఇళ్లకుగాను 168 ఇళ్ల పూర్తి కావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఈ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

నరసన్నపేట: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డా. గొలివి మోహనరావు సూచించారు. మంగళవారం పట్టణంలో ఒక ప్రైవేటు కళాశాలలో మాద్రక ద్రవ్యాల వినియోగం.. దాని వల్ల కలుగు అనర్థాలపై అవగాహన సదస్సును అఖిల భారత యవజన సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా పోలీసు, ఎస్ఈబీ అధికారులు తగిన చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సెబ్ సీఐ సతీష్, ఏఎస్ఐ అసిరినాయుడు, ఎంఈవో ఉప్పాడ శాంతారావు, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే ఎంజీఆర్ ప్రజాదర్బార్

పాతపట్నం: స్థానిక క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. వివిధ సమస్యలపై వినతిపత్రాలను అందించవచ్చన్నారు. బుధవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు మెళియాపుట్టి, 10.15 నుంచి మధ్యాహ్నం 12.15 వరకు కొత్తూరు, మధ్యాహ్నం 12.30 నుండి 2.30 వరకు ఎల్ఎన్‌పేట, 2.30 నుంచి సాయం త్రం 4.45 వరకు హిరమండలం, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు పాతపట్న మండల ప్రజానీకం సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ అవకాశాన్ని ఆయా మండలాల ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

అర్హులందరికీ పథకాలు వర్తించాలి

ఎల్.ఎన్.పేట: ప్రభుత్వం ప్రకటిస్తున్న పథకాలన్నీ అర్హులైన నాయీ బ్రాహ్మణులందరికీ వర్తింపజేయాలని జిల్లా నాయీబ్రాహ్మణ సాధికార కమిటీ అధ్యక్షుడు కె.వెంకటరావు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ.. మండల స్థాయిలో సంఘాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పాతపట్నం నియోజక వర్గంలోని ఐదు మండలాల నుంచి నియోజకవర్గస్థాయిలో నాయీబ్రాహ్మణుల కోర్ కమిటీని ఏర్పా టు చేయడం జరిగిందని, ఈ కమిటీ ద్వారా సమస్యలు పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సోమేశ్వరరావు, ఎ.బాలకృష్ణ, ఉపాధ్యక్షుడు కె.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.





ABN ఆంధ్రజ్యోతి
ఏబీఎన్ - ఆంధ్రజ్యోతిలో మరిన్ని క్రైం వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి
మీ స్మార్ట్‌ఫోన్‌లో యాప్ స్టోర్ నుంచి క్యూఆర్ కోడ్ స్కానర్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుంటే, మీ ఫోన్ కెమెరా ద్వారా ఈ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

హరిపురం: మందస మండలం కొర్రాయిగేటు సమీపంలో హైవే పక్కన మంగళవారం షెడ్డు నిర్మాణంలో వెల్డింగ్ పనిచేస్తుండగా రాజాం కార్తీక్(23) విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందాడు. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. కొర్రాయిగేటుకు చెందిన గేదెల నరేష్ గ్రానైట్ రాళ్ల వ్యాపారం చేస్తూ.. కొత్తగా షెడ్డు నిర్మాణం చేపడుతున్నాడు. ఈ క్రమంలో షెడ్డులో పలాస ఉదయపురానికి చెందిన రాజాం కార్తీక్ వెల్డింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యువకుడు మృతితో ఉదయపురంలో విషాదఛాయలు అలముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయాలు

బూర్జ: పెద్దపేట జంక్షన్‌లో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం వలగెడ్డ గ్రామానికి చెందిన ఆరిక మణికంఠ శ్రీకాకుళం నుంచి పాలకొండ వైపు వస్తుండగా ఎదురుగా శ్రీకాకుళం వైపు వస్తున్న లారీ ఢీకొంటింది. ఈ ఘటనలో మణకంఠ తీవ్రంగా గాయపడగా.. ఢీకొన్న ఆపకుండా వెళ్లిపోయింది. గాయపడిన మణికంఠను స్థానికుల సాయంతో 108 వాహనంలో చికిత్స నిమిత్తం పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులకు చిక్కిన బైక్ దొంగ


వాహనాలతో నిందితుడ్ని చూపిస్తున్న సీఐ

శ్రీకాకుళం క్రైం: ద్విచక్రవాహనం దొంగతనం చేసిన ఓ దొంగ టూటౌన్ పోలీసులకు చిక్కాడు. వివరాల్లోకి వెళ్తే.. నగరంలోని రిమ్స్ ఆసుపత్రి బయట సిబ్బంది పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని ఇటీవల రిమ్స్ సి బ్బంది టూ టౌన్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో టూటౌన్ సీఐ జి.ఉ మామహేశ్వరరావు తన సిబ్బందితో నిఘా వేయించారు. ఈ క్రమంలో మంగళవా రం రిమ్స్ ఆస్పత్రి వద్ద కాపు కాయగా.. కొమ్ము రాజేష్ మళ్లీ బైక్ చోరీకి ప్రయత్ని స్తుండగా పట్టుకున్నారు. రాజేశ్‌ను అదుపులో తీసుకుని సీఐ విచారించగా.. గతంలో మూడు బైక్‌లను చోరీ చేసినట్టు అంగీకరించాడు. అతడి వద్ద ఉన్న మూడు బైక్‌ల ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. నిందితుడ్ని చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐ హరికృష్ణ, క్రైం సిబ్బందిని సీఐ అభినందించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్: విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రవి మాట్లాడుతూ.. జూలై 20 నుంచి 30వ తేదీ వరకు హాస్టళ్ల సందర్శన కార్యక్రమం చేపట్టామని, అన్ని వసతి గృహాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ విద్యార్థుల సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మొటిక్ ఛార్జీలను విడుదల చేయాలని, ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లకు శాశ్వత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతీ హాస్టల్‌లో తాగునీటి కోసం మినీ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

పారిశుధ్య కార్మికులపై వేధింపులు ఆపాలి

అరసవల్లి: పారిశుధ్య కార్మికులపై వార్డు సెక్రటరీలు, టీడీపీ వార్డు ఇన్‌చార్జిల వేధింపులు ఆపాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయూ అనుబంధ) నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఫెడరేషన్ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.బలరాం, ఎ.గణేష్ మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధి, విస్తీర్ణం పెరిగిందని, అందుకు అనుగుణంగా పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం నగర కమిషనర్ చల్లా ఓబులేసుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, ఎ.రాము, ఎ.శంకర్, డి.చిట్టి, ఎ.జనార్దన్, ఎ.మాధవి, టి.వెంకటలక్ష్మి, ఎ.లక్ష్మి, డి.దేవి, ఎ.జ్యోతిప్రసాద్, ఎ.పూలవతి తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

అరసవల్లి: ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు గుర్తించి వారిని అన్నివిధాలా ఆదుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా ప్రతినిధులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రైతులు దయనీయ పరిస్థితి నుంచి బయటపడాలని, కూటమి ప్రభుత్వంలో వారి కష్టాలకు విముక్తి లభించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సీపాన కృష్ణమూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరుకోల రామారావు, కిల్లి లక్ష్మణరావు, నడుపూరు లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పాడ శ్యామలరావు పాల్గొన్నారు.

బడా కంపెనీలను బహిష్కరించండి

అరసవల్లి: బడా కార్పొరేట్ కంపెనీలను బహిష్కరించాలని, వారి దోపిడీని అరికట్టి వ్యవసాయాన్ని పరిరక్షించాలని రైతు సంఘాల సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ తాండ్ర ప్రకాష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు నగరంలోని క్రాంతిభవన్‌లో ఎస్‌కేఎంకే భాగస్వామ్య సంఘాలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. నాయకులు కె.మోహనరావు, జి.సింహాచలం తదితరులతో కలిసి ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 9న క్విట్ ఇండియా రోజున బడా కార్పొరేట్ కంపెనీలను బహిష్కరించండి నినాదంతో చేపట్టనున్న దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

శ్రీకాకుళం అర్బన్: యువత మాదకద్రవ్యాల జోలికి వెళ్లి తమ భవిష్యత్ నాశనం చేసుకోవద్దని జిల్లా రెడ్‌క్రాస్ కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు సూచించారు. కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో జిల్లా రెడ్ క్రాస్ వారి ఆధ్వర్యంలో మంగళవారం డ్రగ్స్, టొబాకో వంటి మాదక ద్రవ్యాలు వలన కలిగే దుష్ప్రభావాలుపై విద్యారుకతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.శివశంకర్, వైస్ ప్రిన్సిపాల్ కె.వేణు, ఎన్ఎస్ఎస్ విభాగాధిపతి మజ్జి శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ ప్రోగ్రామింగ్ అధికారి గొలివి రమణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● **ఆమదాలవలస:** విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని సీఐ జి.దివాకర్‌యాదవ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మైనర్లు ద్విచక్ర వాహనాలు నడపడం వల్ల కలిగే నష్టాలు వివరించారు.

ఆదిత్యాలయ షాపులకు నోటీసులు

అరసవల్లి: ఆదిత్యాలయ ఆవరణలో గల షాపుల గడువు ఈ ఏడాది మార్చితో గడువు తీరిపోయింది. ఎన్నికల సమయం కావడం బహిరంగ వేలం నిర్వహించకుండా ఏప్రిల్ నెల నుంచి 10శాతం పెంచిన అద్దె సొమ్మును ఆలయ అధికారులు వసూలు చేస్తున్నారు. ఇప్పుడు వేలం వేసేందుకు వారం రోజుల్లో షాపులను ఖాళీ చేయాలని మంగళవారం నోటీసులను జారీ చేశారు. అలాగే నోటీసులు అందుకున్న వారం రోజుల్లో రానున్న మూడేళ్లకు సంబంధించి షాపులకు బహిరంగ వేలం నిర్వహిస్తామని ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. అలాగే ఆదిత్యుని దర్శనానికి దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు 10 ఏసీ రూమ్‌లు అందు బాటులో ఉన్నట్లు ఈవో తెలిపారు. వివరాలకు 8978914660 ఫోన్ నెంబరులో సంప్రదించాలన్నారు.

చిన్నారి శస్త్ర చికిత్సకు సాయం

కంచిలి: కర్తలి గ్రామానికి చెందిన తాతయ్య, ధనలక్ష్మి దంపతుల కుమారుడు హృషీకేష్ ఆటాపాటలతో అలరించాల్సిన వయసులో కేన్సర్ బారినపడ్డాడు. చికిత్సకు రూ.25లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. నిరుపేద కుటుంబం కావడంతో వారి స్థితిని గ్రామ యువత ఎస్‌జీఎఫ్ సంస్థ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆ సంస్థ ప్రతినిధులు ఆ బాబు విశాఖలో చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వెళ్లి రూ.115000 సాయంగా అందజేసింది. ఎస్‌జీఎష్ సభ్యులు ఢిల్లేశ్వరి, వారి స్నేహితులు విరాళాలు సేకరించడంలో కీలక పాత్ర పోషించారు. దాతలు స్పందించి చిన్నారి చికిత్సకు సాయం అందించాలని కోరుతున్నారు.

ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

ఇచ్ఛాపురం: ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో కలిగిన విద్యను అలవరుచుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇమ్మాన్యుయేల్ రాజు అన్నారు. మంగళవారం బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ బి.శంకరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సీఐ పాల్గొని మాట్లాడారు.

పంచాయతీ నిధులు మెక్కేసిన వైసీపీ

● ఎమ్మెల్యే గొండు శంకర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం రూరల్: గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీ నిధులు మెక్కేయడంతో గ్రామాలు అభివృద్ధికి దూరమయ్యాయని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మునసబుపేటలో మండల, గ్రామీణ స్థాయి అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించకపోగా వారి సమస్యలను గాలికి వదిలేశారంటూ ఎద్దేవా చేశారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో కనీస సౌకర్యాలైన తాగు నీరు, విద్యుత్, కాలువలు, పారిశుధ్య పనులపై దృష్టిసారించాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని, లేకుంటే బదిలీపై వెళ్లిపోవాలని హెచ్చరించారు. టీడీపీ నాయకులు పీస రమణ, అరవల రవీంద్ర, మూకళ్ల శ్రీనివాస రావు, జయానంద్, ఆదిత్యనాయుడు పాల్గొన్నారు.

అరసవల్లి అభివృద్ధిపై దృష్టి

అరసవల్లి: అరసవల్లిని అన్ని విధాలా ఆదర్శవంతంగా తీర్చిదిద్ది అభివృద్ధికి చిరునామాగా మారుస్తానని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మంగళవారం ఆయన ఖాజీపేట, అరసవల్లిలోని కొయ్యాన కన్నయ్య కాలనీ, ఆదిత్యనగర్, బొమ్మాడి వీధి, 25వ డివిజన్ పరిధిలో నగర కమిషనర్ ఓబులేసుతో కలిసి పర్యటించారు. గత వైసీపీ పాలనలో ప్రభుత్వం అరసవల్లి గ్రామంలో కనీస సదుపాయాలు కూడా కల్పించకుండా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించండి

● మెట్టవలసలో పర్యటించిన డీఎంహెచ్‌వో


వైద్యాధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో మీనాక్షి

జి.సిగడాం, అగస్టు 6: ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని డీఎంహెచ్‌వో బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. మంగళవారం మెట్టవలస గ్రామంలో ఆమె పర్యటించి డయేరియా బాధితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాచీ చల్లార్చిన నీళ్లను తాగాలని, ఆహారాన్ని తీసుకునేటప్పుడు జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. డయేరియా అదుపులోకి వచ్చే వరకు వైద్యం అందించాలని సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు. ఇంటింటికీ వెళ్లి బాధితుల పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం గ్రామానికి ఆనుకొని ఉన్న కోళ్ల ఫారాన్ని పరిశీలించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని యాజమాన్యానికి సూచించారు.

51 చేరిన బాధితులు

మెట్టవలసలో డయేరియా ప్రబలడంతో మంగళవారం నాటికి రోగులు సంఖ్య 51కి చేరింది. వీరిలో 31 మంది పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మిగిలినవారికి గ్రామంలో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. మంగళవారం 16 మంది డయేరియా బారిన పడగా.. వారిలో ఆరుగురిని ఆసుపత్రులకు తరలించారు. డీఎల్‌పీ ఆర్.గోపి బాల పర్యవేక్షణలో శానిటేషన్, క్లోరినేషన్‌తో పాటు పారిశుధ్య పనులు చేపట్టారు.

సాయన్నగెడ్డకు గండి


గండి పనులను పరిశీలిస్తున్న ఏఈ

పొందూరు: పొందూరు మండలం గోకర్ణపల్లి, విజయనగరం జిల్లా సంతకవిటి మండలం గారన్నాయుడుపేట గ్రామాల సమీపంలో సాయన్నగెడ్డకు పడిన భారీ గండి పడింది. దీంతో ఇరిగేషన్ అధికారులు మంగళవారం మరమ్మతు పనులు చేపట్టారు. సాయన్నచానెల్‌కు సోమవారం భారీ గండి పడి నీరు భారీగా వృథాగా పోవడంతో ఆ ప్రభావం పొందూరు మండలం గంగ్రేడు, తాడివలస గ్రామలపై పడింది. దీంతో తాడివలస, గంగ్రేడు, లొద్దలపేట తదితర గ్రామాలకు చెందిన రైతులు స్వచ్ఛంగా గండిపూడ్చే పనులు చేశారు. ఫిర్యాదు రావడంతో మంగళవారం ఇరిగేషన్ అధికారు గండిని పూడ్చేందుకు శాశ్వతపనులు చేపట్టారు. ఈ పనులను ఇరిగేషన్ ఏఈ రమణ పరిశీలించారు.

కలెక్టర్ గారు.. నరక ప్రయాణం తప్పించరూ..


గుంతలో ఇరుక్కుపోయిన కారు

సరుబుజ్జిలి: మండల కేంద్ర సమీపంలో ప్రధాన రహదారిపై నిత్యం నరక ప్రయాణం సాగిస్తున్న వాహనదారులకు కలెక్టర్ స్పందించి విముక్తి కలిగించాలని మండల ప్రజలు కోరుతున్నారు. అలికాం-బత్తిలి ప్రధాన రహదారిపై సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ఉన్న ఈ రహదారిలో భారీ గుంతలు ఏర్పడి వాహనదారులు నరకయాతన పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఒక కారు గుంతలో దిగి రోడ్డును గుద్దడంతో.. ఆ కారు ముందు భాగం ఊడిపడింది. ఇలా ప్రతి రోజూ ఏదో ఒక ఘటన జరుగుతున్నా పట్టించుకునే నాథుడు కరవయ్యాడు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించాలని స్థానికులు కోరతున్నారు.

తెరవని పశువైద్య కేంద్రం

● ఎమ్మెల్యే వచ్చినా పట్టని వైనం


పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి: స్థానిక పశువైద్య కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే బెందాళం అశోక్ తనిఖీ చేశారు. ఈ పశువైద్యశాల నిత్యం తాళం వేసి ఉంటుందని రైతులు, స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఎమ్మెల్యే పరిశీలనకు వచ్చారు. దీంతో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తానని ఎమ్మెల్యే అశోక్ హామీ ఇచ్చారు. టీడీపీ నేతలు ఎ.మధు, బి.తిరుమలరావు, జి.రామారావు, టి.మోహనరావు, వి.రంగారావు, బి.గిరిబాబులున్నారు.

ఆశ్రమ పాఠశాల పరిశీలన

కంచిలి: నువాగడ గిరిజన ఆశ్రమ పాఠశాలను జిల్లా మలేరియా నియంత్రణాధికారి సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. పాఠశాలలోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించగా.. ఎనిమిది మంది విద్యార్థుకు మలేరియా లక్షణాలు కనిపించడంతో వారిని వైద్యం కోసం సోంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొంతమంది విద్యార్థుల్లో మలేరియా లక్షణాలు కనిపించడంతో ముందస్తు జాగ్రత్తగా చికిత్స అందిస్తున్నామన్నారు. అనంతరం కంచిలి పీహెచ్‌సీని సందర్శించారు. ప్రపంచ బ్యాంక్ ప్రతినిధి శ్రీకాంత్, ఎంపీడీవో వి.నీరజ, సోంపేట సబ్ డివిజనల్ మలేరియా అధికారి ఎన్.లక్ష్మీనారాయణ, ఈవోపీఆర్డీ రాంబాబు, ఎంటీఎస్ నాగేష్, హెచ్ఎంలు దుర్గాప్రసాద్ పాడి, కంచిలి వైద్యాధికారిణి టి.హరిబాబు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శాసన మండలి చైర్మన్ పర్యటన

● రాజకీయ పర్యటనా? వ్యక్తిగతమా?

కవిటి: ఏపీ శాసన మండలి చైర్మన్ కె.మోషన్‌రాజు ఉద్దానం ప్రాంతం కవిటిలో పర్యటించారు. మంగళవారం అంపురం జంక్షన్ వద్ద ఆయన్ని ఎమ్మెల్సీ నర్తు రామారావు ముఖ్య నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కొత్తపుట్టుగలోని ఎమ్మెల్సీ నివాసానికి మండల చైర్మన్ రావడంతో వైసీపీ ముఖ్య నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో గల ప్రధాన సమస్యలను చైర్మన్‌కు వివరించారు. అయితే పార్టీ ముఖ్య నాయకులకు తప్పా మరెవరికీ సమాచారం లేకపోవడంతో.. చైర్మన్ పర్యటన రాజకీయ పర్యటనా లేదా వ్యక్తిగత పర్యటనా అంటూ వైసీపీ నాయకులు గుసగుసలాడుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ధర్మాన ఇంటికి మండలి చైర్మన్

శ్రీకాకుళం రూరల్: మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావును ఆయన నివాసంలో శాసన మండలి చైర్మన్ కె.మోషెన్‌రాజు మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ని ఘనంగా సత్కరించారు.

సాంకేతిక విజ్ఞానాన్ని అందించాలి



మాట్లాడుతున్న బాలమోహన్‌దాస్

ఎచ్చెర్ల: సమాజ హితానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మాజీ ఉపకులపతి వి.బాల మోహన్ దాస్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్సిటీలో ఇంజనీరింగ్ కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థు లకు పరిచయ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గత శతాబ్ది కాలంలో ఎన్నో నూతన, ప్రయోజనకర ఆవిష్కరణలకు వేదిక అయిందన్నారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ జడ్జి (నెల్లూరు), బీఆర్ఏయూ అంబుడ్స్‌మెన్ పర్సన్ జస్టిస్ జి.వెంకట క్రిష్ణయ్య మాట్లాడుతూ.. సమాజంతో, ప్రకృతిలో స్నేహపూర్వకంగా మెలిగితే ఎంచుకున్న వృత్తిలో ఉన్నతస్థాయికి చేరుకోవచ్చన్నారు. బీఆర్ఏయూ వీసీ ప్రొఫెసర్ రజని మాట్లాడుతూ.. ప్రముఖ జీవిత చరిత్రలను చదవడంతో స్ఫూర్తి పొందవచ్చన్నారు. వర్సిటీ రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, ప్రిన్సిపాల్ రాజశేఖరరావు, ఓఎస్‌డీ యు.కావ్యజ్యోత్స్న పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం


పైడిరాజును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

జి.సిగడాం: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా అగుడులు వేద్దామని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. ఇటీవల శస్త్ర చికిత్స చేసుకున్న పెనసాం గ్రామానికి చెందిన జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి తాలాబత్తుల పైడిరాజును మంగళవారం ఆయన పరామర్శించారు. గ్రామస్థులతో మాట్లాడారు. కూటమి నాయకులు ముప్పిడి సురేష్, మీసాల రవికుమార్, వెంకట రావు తదితరులు ఉన్నారు. కాగా మెట్టవలస గ్రామానికి ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) చొరవతో మంగళవారం గ్రామానికి తాగునీరు అందంచేందుకు పనులు చేపట్టారు.

ఎస్పీని కలిసిన డీఎస్పీ



శ్రీకాకుళం: జిల్లాలో ఇటీవల జరిగిన డీఎస్పీల బదిలీల్లో భాగంగా కాశీబుగ్గ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన పి.శ్రీనివాసరావు మంగళవారం ఎస్పీ మహేశ్వరరెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.

జీవో 117 రద్దు చేయాలని వినతి


వినతి పత్రం ఇస్తున్న ఎన్‌టీఏ సభ్యులు

గుజరాతీపేట: రాష్ట్రంలో అనేక పాఠశాలలు మూతకు కారణమైన జీవో 11ను వెంటనే ఎత్తివేయాలని నోబుల్ టీచర్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) జిల్లా శాఖ అధ్యక్షులు సూర పాపారావు కోరారు. ఈ మేరకు కేంద్ర పౌర విమానయాన శాఖమాత్యులు కింజరాపు రామ్మోహన్‌నాయుడును మర్యాద పూర్వకంగా కలిసి మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. అదేవిధంగా ఉపాధ్యా యులు బోధనకు దూరం చేస్తున్న అనేక యాప్లను తొలగించాలని, సర్కారు బడుల్లో తెలుగు మీడియం పరీక్షలు నిర్వహించాలని ఈ వినతిలో పేర్కొన్నారు. ఎన్‌టీఏ ప్రతినిధులు సీపాన ముకుందరావు, వావిలిపల్లి రాజారావు పాల్గొన్నారు.

11న జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్: జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలను నిర్వహించనున్నట్టు వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఐ.భాస్కరరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ పోటీలు మునసబుపేట గురజాడ విద్యాసంస్థల కళా ప్రాంగణం నిర్వహిస్తున్నట్టు తెలియజేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 38వ పురుషుల, 23వ మహిళా వెయిట్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాకార్యదర్శి కె.శ్రీనివాసరావు, ట్రైనీ ఇప్పిలి అప్పన్నలు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

గుజరాతీపేట: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో సైబర్ నేరాలు, మైనర్ డ్రైవింగ్ అనే అంశంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సందీప్ పాల్గొని మాట్లాడారు. సైబర్ నేరాలకు, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయడం చట్ట విరుద్ధమని, వీటికి విద్యార్థులు దూరంలో ఉండాలన్నారు. సైబర్ నేరాలపై 1930, ఇతర నేరాలపై 100 నెంబర్‌కు ఫోన్ చేసినట్టయితే తక్షణమే స్పందిస్తామని తెలియజేశారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పైడి శంకరనారాయణ, అధ్యాపకులు కృష్ణారావు, కృష్ణారావు, పద్మావతి పాల్గొన్నారు.

9న అప్రంటీస్ మేళా

ఎచ్చెర్ల: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 9న అప్రంటీస్ మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అరబిందోలో అప్రంటీస్ చేసేందుకు ఫిట్టర్, ఎలక్ట్రికల్ ట్రేడ్‌ల్లో ఉత్తీర్ణులు అర్హులన్నారు. రెండు జతల బయోడేటా, ఆధార్, ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు.

ఆదిలక్ష్మీ దేవిగా విజయదుర్గమ్మ

శ్రీకాకుళం కల్చరల్: శ్రావణమాసం ప్రారం భం సందర్భంగా మంగళవారం నానుబాల వారి వీధిలో ఉన్న విజయదుర్గా దేవికి అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో ఆదిలక్ష్మి దేవిగా అలంకరించారు. అదేవిధంగా సంతోషిమాత అమ్మ వారి దేవస్థానంలో సుప్రభాత సేవ, సహస్ర నామార్చన కుంకుమ పూజలు ప్రధాన అర్చకులు కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.

● **ఇచ్ఛాపురం:** శ్రావణమాసం మొదటి మంగళవారం సందర్భంగా స్థానిక స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేకంగా సిందూర మర్దన, కుంకుమార్చనలు జరిపారు.




శ్రీకాకుళం కల్చరల్: అలంకరణలో సంతోషిమాత, విజయదుర్గమ్మ
ఇచ్ఛాపురం: స్వేచ్ఛావతి అమ్మవారు


జేసీ ఫర్మాద్ అహ్మద్ ఖాన్

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం

● క్షేత్రస్థాయికి ప్రభుత్వ కార్యక్రమాలు చేరువ
● లోపాలు లేకుండా రెవెన్యూ సేవలు
● ఇబ్బందులుంటే నేరుగా ఫోన్ చేయొచ్చు
● జాయింట్ కలెక్టర్ ఫర్మాద్ అహ్మద్‌ఖాన్

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

'ప్రజా సమస్యల పరిష్కారానికే అత్యంత ప్రాధాన్యమిచ్చి.. లోపాలు లేకుండా రెవెనూ, సివిల్ సప్లయ్ సేవలు అందిస్తా'నంటూ జాయింట్ కలెక్టర్ ఫర్మాద్ అహ్మద్ ఖాన్ వెల్లడించారు. ఈ ఆయన 'ఆంధ్రజ్యోతి'తో తన చదువు, ఉద్యోగం తదితర అంశాల గురించి మాట్లాడారు. ఆయన మాటల్లోనే..

గుర్‌గ్రామ్‌లోనే చదువు

మాది హర్యానా రాష్ట్రంలో గుర్‌గ్రామ్ ప్రాంతం. నాన్న రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగిగా పనిచేస్తూ ఇటీవలే మరణించారు. అమ్మ గృహిణి. అన్నయ్య మెకానికల్ ఇంజనీర్.. హర్యానాలో ఉంటున్నారు. చెల్లి మైక్రోబయాలజీ చదివి హాస్పెటల్‌లో విధులు నిర్వహిస్తుంది. నేను ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు గుర్‌గ్రామ్‌లోనే చదివా. ఆ తర్వాత బీటెక్ గుర్‌గ్రామ్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో పూర్తిచేశాను. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో మాస్టర్ పబ్లిక్ మేనేజ్‌మెంట్ పూర్తిచేశాను. 2019లో సివిల్స్ పరీక్ష రాసి... 2020లో ఐఏఎస్‌కు ఎంపికయ్యాను. అలానే ఢిల్లీలో నేషనల్ లా యూనివర్సిటీలో క్రిమినాలజీ విభాగంలో పీజీ డిప్లమో పూర్తి చేశాను.

నెల్లూరులోనే శిక్షణ

ట్రైనీ కలెక్టర్‌గా నెల్లూరులో చేరాను. అక్కడ కొన్నాళ్లు శిక్షణ పొందాను. ఆ తర్వాత అల్లూరి సీతారామారాజు జిల్లాలో ఐటీడీఏ పీవోగా పోస్టింగ్ వచ్చింది. అక్కడ నుంచి కొన్నాళ్ల తర్వాత రాజంపేట సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వహించాను. అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేశాను. అక్కడి నుంచి ఇటీవలే శ్రీకాకుళం జేసీగా బదిలీపై ఇక్కడకు వచ్చాను.

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తా..

ప్రధానంగా జాయింట్ కలెక్టర్ పరిధిలో రెవెన్యూ, సివిల్ సప్లయ్ శాఖలు ఉంటాయి. ప్రజలకు క్షేత్రస్థాయిలో నాణ్యమైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటాను. ప్రభుత్వం కూడా ఈ రెండు శాఖలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తోంది. ప్రభుత్వం ప్రకటించే కార్యక్రమాలు ప్రజలకు చేరువయ్యేలా చేస్తా. క్షేత్రస్థాయిలో నిత్యం పరిశీలన చేస్తాను. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు.. అలాగే రైతులకు చెల్లింపులు.. ఈ వ్యవహారాలు పారదర్శకంగా జరిగేలా.. రైతులకు ఏ విధమైన నష్టం లేకుండా చర్యలు తీసుకుంటాను. నిత్యావసరాల పంపిణీ సక్రమంగా జరిగేలా పర్యవేక్షిస్తాను.

కలెక్టర్ అప్పగించే శాఖలపైనా..

కలెక్టర్ అన్నింటికి బాస్. ఆయన అప్పగించే శాఖలపై పర్యవేక్షణ చేసి.. ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు అందేలా చేస్తాను. అలాగే కలెక్టర్ అప్పగించే శాఖలపై సమీక్షలు జరిపి అన్ని శాఖల అధికారులను కోఆర్డినేషన్ చేసుకుంటూ జిల్లా ప్రగతిలో భాగస్వామ్యం అవుతాను.

నేరుగా సమస్యలు చెప్పవచ్చు..

పబ్లిక్ గ్రీవెన్స్‌కు నేను ఎప్పుడూ అత్యంత ప్రాధాన్యం ఇస్తాను. ఇటు రెవెన్యూ సమస్యలపైనా.. అటు సివిల్ సప్లయ్ విభాగంలో ప్రజలకు సమస్యలు ఎదురైతే నేరుగా నాకు ఫోన్ చేయవచ్చు. లేదా సమస్యను వివరిస్తూ నా ఫోన్ నెంబరు 8143193111 మెసేజ్ చేసినా స్పందించి చర్యలు తీసుకుంటాను.

నేడు ఎన్ఎస్ఎస్ పీవోలతో సమావేశం

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల ఎన్ఎస్ఎస్ పీవోలతో బుధవారం సమావేశాన్ని నిర్వహించనున్నట్టు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, వర్సిటీ ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ తెలిపారు. వర్సిటీలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి వీసీ రజని ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

సోంపేట: కొర్లాం గ్రామంలో 81/2 సర్వే నెంబరులో ఉన్న అక్రమ కట్టడాలపై సర్వే చేపట్టి చర్యలు తీసు కోవాలని ఆ గ్రామస్థులు తహసీల్దార్ అప్పలస్వామికి మంగళవారం వినతి పత్రం అందించారు. పై సర్వే నెంబరులో గతంలో చెరువు ఉండేదని హైవే విస్తరణ అనంతరం కొందరు ఈ చెరువును ఆక్రమించారని, సర్వే చేపట్టి అక్రమ నిర్మాణాలను తొలగించాలని కోరారు. వినతి పత్రం అందించినవారిలో రాంబుడ్డి గణపతి, తామాడ వాసుదేవరావు, రత్నాల వెంకటరమణ, రాంబుడ్డి జానకిరావు, రాంబుడ్డి ఉమామ హేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఉన్నతచదువులే లక్ష్యంగా సాగాలి

సోంపేట: విద్యార్థులు ఉన్నత చదువులే లక్ష్యంగా పెట్టుకుంటే మంచి స్థానానికి చేరుకునేందుకు అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. జూనియర్ కళాశాల, మోడల్ పాఠశాలలోని ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.మోహనరావు, అధ్యాపకులు రజనీకుమారి, ఎ.రామినాయుడు తదితరులు ఉన్నారు.

● **కవిటి:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం అందించిన పాఠ్య పుస్తకాలను ఎమ్మెల్యే బి.అశోక్ పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ పి.రాజేశ్వరరావు,నేతలు బి.రమేష్, ఎ.మదు, బి.కామరాజు, టి.మోహనరావు, వి.రంగారావు, జి.రామారావు, ముకుంద రావు, బి.రవి పాల్గొన్నారు.

వార్షిక మహోత్సవాలు ప్రారంభం

అరసవల్లి: నగరంలోని స్థానిక అరసవల్లి రోడ్డులో గల రమ్య తిరుమల ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా మహాలక్ష్మి అమ్మవారి వార్షిక మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రతీరోజు ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు సామూహిక సహస్ర నామార్చన, కుంకుమపూజ జరుగుతుంది. 8వ తేదీ ఉదయం 7.30 గంటల నుంచి 9.30 వరకు అమ్మవారికి పంచామృత నవకలశ అభిషేకం, అర్చన, అలంకారం, అనంతరం శ్రీ మహాలక్ష్మీహవనం, మంగళాశాసనం, తీర్థ ప్రసాద వినియోగం జరుగుతుందని, 16వ తేదీన వరలక్ష్మీ వ్రతం జరుగుతుందని, భక్తులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ప్రధానార్చకులు కరిరంగనాథ వేణుమాధవాచార్యులు తెలిపారు.